
టెట్‌కు వేళాయె

❖ రేపటి నుంచే పరీక్షలు
❖ ఉమ్మడి జిల్లాలో 8 కేంద్రాల్లో ఏర్పాట్లు

ఈనాడు, అమరావతి



గత ఐదేళ్ల వైకాపా పాలనలో ఒక్క డీఎస్సీ పరీక్షనూ నిర్వహించలేదు. ఉపాధ్యాయ కొలువుల కోసం కళ్లు కాయలు కాచేలా ఎదురు చూసిన అభ్యర్థుల ఆశలపై నీళ్లు చల్లింది. తెదేపా కూటమి అధికారంలోకి రాగానే ఎన్నికల్లో ఇచ్చిన హామీని నెరవేర్చే దిశగా తొలుత టెట్ ఆపై డీఎస్సీ నిర్వహణకు చర్యలు తీసుకుంది. 16 వేల పైచిలుకు పోస్టుల భర్తీకి ఉత్తర్వులిచ్చింది. ప్రస్తుతం గురువారం నుంచి ఈ నెల 21 వరకు టీచర్ ఎలిజిబులిటీ టెస్ట్ (టెట్) జరగనుంది. ఇందుకోసం గుంటూరు, పల్నాడు జిల్లాల్లో 8 కేంద్రాల్లో 30 వేలమంది అభ్యర్థులకు తగ్గట్టుగా విద్యాశాఖ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆన్‌లైన్‌లో పరీక్ష నిర్వహణ బాధ్యతను ప్రభుత్వం టీసీఎస్‌కు అప్పగించింది. పరీక్ష సమయంలో విద్యుత్తు అంతరాయం, కంప్యూటర్లు మొరాయించడం వంటి అంతరాయాల్లేని కళాశాలల్లో ఈ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఎస్జీటీలు, స్కూల్ అసిస్టెంట్లు, లాంగ్వేజ్ పండిట్లకు వారి మెథడాలజీని అనుసరించి వివిధ తేదీల్లో పరీక్ష నిర్వహించేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకున్నారు. అభ్యర్థుల సొంత జిల్లాల్లో పరీక్ష కేంద్రాలు కేటాయించలేదు.

ఇందులో అర్హత సాధిస్తేనే: టెట్‌లో అర్హత సాధిస్తేనే డీఎస్సీ రాయడానికి వీలవుతుంది. ఇప్పటికే అభ్యర్థుల హాల్‌టికెట్లను వెబ్‌సైట్‌లో పెట్టారు. వీటిల్లో ఆయా పరీక్ష కేంద్రాల పూర్తి చిరునామాలు పేర్కొన్నారు. వాటిని సులభంగా చేరుకోవచ్చని విద్యాశాఖ వర్గాలు తెలిపాయి. బాపట్ల జిల్లాలో పరీక్ష కేంద్రాల్లేవు.

గుంటూరు జిల్లాలో పరీక్ష కేంద్రాల వివరాలు

సెంటర్ కోడ్	కేంద్రం పేరు	పూర్తి చిరునామా
7996	ఐయాన్ డిజిటల్ జోన్, పేరేచర్ల	యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ, డోకిపర్రు, నియర్ పేరేచర్ల, నరసరావుపేట రోడ్, మేడికొండూరు మండలం
8891	మలినేని పెరుమాళ్ల ఎడ్యుకేషనల్ సొసైటీస్ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్	పుల్లడిగుంట, ప్రత్తిపాడు మెయిన్‌రోడ్, వట్టిచెరుకూరు మండలం
9651	ప్రియదర్శిని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్	ఐదవ మైలు, కొర్నెపాడు, ప్రత్తిపాడు మెయిన్ రోడ్, వట్టిచెరుకూరు మండలం
30318	బాలాజీ ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ	బ్లాకు–బి, చల్లావారిపాలెం, నల్లపాడు రోడ్, గుంటూరు

పల్నాడు జిల్లాలో....

1229	నరసరావుపేట ఇంజినీరింగ్ కాలేజీ	కోటప్పకొండరోడ్, యల్లమంద, నరసరావుపేట
9652	మామ్ ఉమెన్స్ ఇంజినీరింగ్ కాలేజీ	కేశానుపల్లి, నరసరావుపేట మండలం,
8890	నరసరావుపేట ఇంజినీరింగ్ కాలేజీ అటానమస్‌బ్లాకు–4	కోటప్పకొండరోడ్, యల్లమంద, నరసరావుపేట మండలం
9136	ఎ.ఎంరెడ్డి మెమోరియల్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ	వినుకొండ రోడ్, అట్లూరి మస్తాన్‌రెడ్డి నగర్, పెట్లూరివారిపాలెం, నరసరావుపేట మండలం

ఇంటింటా ఓటర్ల సర్వే 99 శాతం పూర్తి: కలెక్టర్

బాపట్ల, న్యూస్‌టుడే: సంక్షిప్త ఓటర్ల జాబితా తయారీకి ఇంటింటా ఓటర్ల సర్వే ప్రక్రియ జిల్లాలో 99.09 శాతం పూర్తయినట్లు కలెక్టర్ వెంకట మురళి తెలిపారు. కలెక్టరేట్లో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సంక్షిప్త ఓటర్ల జాబితా తయారీకి అభ్యంతరాల స్వీకరణ, పరిశీలన పక్కాగా ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఓటర్ల జాబితాలో సవరణల కోసం 12,526 దరఖాస్తులు ఇప్పటి వరకు రాగా 6,327 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నట్లు పేర్కొన్నారు. వారం లోగా వీటిని పరిష్కరిస్తామన్నారు. అభ్యంతరాలపై 6,439 దరఖాస్తులు రాగా 5,820 పరిష్కరించినట్లు తెలిపారు. మిగిలినవి రెండ్రోజుల్లో విచారిస్తామన్నారు. జిల్లాలో 6,408 మంది ఓటర్లు మృతి చెందినట్లు గుర్తించామన్నారు. ప్రస్తుతం 5,441 మంది మృతుల వివరాలను పూర్తి స్థాయిలో విచారించామని చెప్పారు. మిగిలినవి త్వరలో పరిశీలిస్తామన్నారు. పర్చూరు ఎలక్టోరల్ అధికారిగా నియమితులైన చంద్రశేఖర్ దరఖాస్తుల విచారణ చేసేందుకు అనువుగా లాగిన్ అనుమతి ఇవ్వాలని ఈసీని కోరామన్నారు. జేసీ ప్రఖర్ జైన్, డీఆర్వో సీహెచ్ సత్తిబాబు, ఆర్డీవో పి.గ్లోరియా తదితరులు పాల్గొన్నారు.

అమృత్... ఆలస్యం!

ఇంకా సిద్ధంకాని డీపీఆర్‌లు

ఈనాడు, అమరావతి

అమృత్ - 2 పథకం ప్రాజెక్టు సవివర పథక నివేదికలు (డీపీఆర్) ఇంతవరకు సిద్ధం కాలేదు. నగర, పురపాలక సంఘాల్లో ప్రజలకు నాణ్యమైన తాగు నీరు అందించేందుకు, మురుగునీటి శుద్ధి ప్లాంట్ల నిర్మాణాలకు కేంద్రం ఈ పథకం కింద నిధులు మంజూరు చేసింది. ఇప్పటికే డీపీఆర్‌లు పంపిన వాటికి నిధులు విడుదలై టెండర్ల ప్రక్రియ నడుస్తోంది. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో రెండో దశలో తాగునీటికి రూ. 309.64 కోట్లు, మురుగునీటి శుద్ధి ప్లాంట్లకు రూ. 203.94 కోట్లు మంజూరయ్యాయి. డీపీఆర్‌లు ఆమోదం పొందాకే ఈ పనులు చేపట్టాల్సి ఉంటుంది.



రేపల్లెలో ట్యాంకరు వద్ద నీరు పట్టుకుంటున్న ఒకటో వార్డు ప్రజలు

ఎందుకో జాప్యం!: డీపీఆర్‌ల ప్రతిపాదనలు కోరి ఇప్పటికే చాలారోజులైనా ఇంజినీరింగ్‌వర్గాలు సిద్ధం చేయలేదు. దీంతో నేరుగా పురపాలకశాఖ ఉన్నతాధికారులే ప్రజారోగ్య ఇంజినీరింగ్ అధికారులు, మున్సిపల్ కమిషనర్లతో ఫోన్‌లో మాట్లాడి గట్టిగా ప్రశ్నించడంతో వారిలో చలనం వచ్చింది. కేంద్రం నిధులిస్తామన్నా. వినియోగించడానికి అభ్యంతరమేమిటి? డీపీఆర్‌ల తయారీకి ఎందుకు జాప్యం చేస్తున్నారని ప్రశ్నించినట్లు తెలిసింది. మొదటి దశలో ఎంపికైన గుంటూరు, తెనాలి, చిలకలూరిపేట, నరసరావుపేటల్లో తాగు నీటి పథకాల నిర్మాణం చేపట్టినా అసంపూర్తిగా ఉన్నాయి. కారణం.. వాటి నిధులను సక్రమంగా వినియోగించకుండా మున్సిపాల్టీల అధికారులు ఇతరత్రా పనులకు వెచ్చించడమే.

జిల్లాల వారీగా తాగునీరు, మురుగునీటి శుద్ధి ప్లాంట్లకు మంజూరైన నిధులు

జిల్లా	నీటి సరఫరాకు	ఎస్‌టీపీ
	(అంకెలు కోట్ల రూపాయల్లో)	
గుంటూరు	47.14	110.81
పల్నాడు	182.42	93.13
బాపట్ల	80.08	0
మొత్తం	309.64	203.94

అమృత్ రెండో దశకు ఎంపికైన పట్టణాలు: మంగళగిరి-తాడేపల్లి కార్పొరేషన్, పొన్నూరు, రేపల్లె, బాపట్ల, మాచర్ల, సత్తెనపల్లి, పిడుగురాళ్ల, వినుకొండ.

మొదటి దశకు ఎంపికైన గుంటూరు, తెనాలి, చిలకలూరిపేట, నరసరావుపేటల్లో ఇంటింటికీ కుళాయి కనెక్షన్లు ఇచ్చారు. ఒక్క గుంటూరు నగరంలోనే 20 వేలకు పైగా కనెక్షన్లు ఇచ్చారు.

ఎమ్మెల్యేల అభిప్రాయాలతో..

ఎక్కడెక్కడ తాగునీటి రిజర్వాయర్లు, పంపుహౌస్‌లు, ఫిల్టరేషన్ ప్లాంట్లు నిర్మించాలి? ఎంత ఖర్చవుతుంది? ఎన్ని మిలియన్ లీటర్ల నీటిని నిల్వ చేయవచ్చు? వాటి పరిధిలోని జనాభా ఎంత? వంటి వివరాలను డీపీఆర్‌లో పొందుపరచాలి. పట్టణాల్లో వెలువడే మురుగునీటి కోసం మురుగునీటి శుద్ధి ప్లాంట్లు (ఎస్‌టీపీ) నిర్మించి ఇక్కడ శుద్ధి చేశాకే కాలువల్లోకి వదిలేలా అమృత్-2లో ప్రతిపాదించారు. ఆయా పట్టణాల్లో ఎన్ని ఎస్‌టీపీలు అవసరం? ఎన్ని లీటర్ల నీటిని శుద్ధి చేస్తారు? ఎంత సామర్థ్యంతో ప్లాంట్లు కావాలో డీపీఆర్‌లో నివేదించాలని నెల క్రితమే ఆదేశించినా ఇప్పటికీ మున్సిపాల్టీలు స్పందించలేదు. ఉద్యోగుల బదిలీలలో డీపీఆర్‌ల తయారీలో జాప్యం చోటుచేసుకుందని ఇంజినీరింగ్‌వర్గాలు చెబుతున్నాయి.

నాలుగైదు రోజుల్లో సిద్ధం చేస్తాం

గతంలోనే డీపీఆర్‌లు సిద్ధం చేశాం. ఎమ్మెల్యేలు మారినందున కొత్తవారి అభిప్రాయాలు తీసుకోవాల్సి ఉంది. రిజర్వాయర్లు, ఎస్‌టీపీల నిర్మాణాలకు ఏమైనా సూచనలు చేస్తే వాటిని కచ్చితంగా పొందుపరచాల్సి ఉంది. అందుకే వారందరి అభిప్రాయాలు తీసుకుని నాలుగైదు రోజుల్లో డీపీఆర్‌లు సిద్ధం చేసి పంపుతాం. **- ప్రజారోగ్య ఇంజినీరింగ్ వర్గాలు**

రాష్ట్రంలో ఆదర్శంగా పింఛన్ల అందజేత: మంత్రి గొట్టిపాటి

జే పంగులూరు, న్యూస్‌టుడే: పింఛన్ల పంపిణీ మిగిలిన రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తోందని విద్యుత్తు శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. మూడో విడత పింఛన్ల పంపిణీలో భాగంగా జే పంగులూరు బీసీ కాలనీలో ఆయన ఇంటింటికీ తిరిగి అందజేశారు. మంత్రి మాట్లాడుతూ పింఛన్‌లను ఒక్కరోజులోనే నూరు శాతం పంపిణీ జరిగేలా చూడడమే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాయకత్వంలోని ప్రభుత్వ లక్ష్యమన్నారు. జే పంగులూరులో మొత్తం 956 మంది రూ.39.34 లక్షలు పంపిణీ చేయనున్నట్లు మంత్రి వివరించారు. ఆయన వెంట చీరాల ఆర్డీవో జి.సూర్యనారాయణరెడ్డి, ఎంపీడీవో బి.రామాంజనేయులు, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు యర్రం శ్రీనివాస రెడ్డి, జడ్పీటీసీ మాజీ సభ్యుడు బాచిన చెంచు ప్రసాద్, తెదేపా మండల అధ్యక్షుడు రావూరి రమేష్‌బాబు, బాలిన రామసుబ్బారావు, కుక్కపల్లి ఏడుకొండలు పాల్గొన్నారు. అద్దంకి పురపాలక సంఘంలో కమిషనర్ డి.రవీంద్ర, మణికేశ్వరంలో ఎంపీడీవో దేవసేనకుమారి పింఛన్లు పంపిణీ చేశారు. మంగళవారం సాయంత్రం ఐదు గంటల వరకు అద్దంకి పురపాలక సంఘంలో 97.44, గ్రామీణంలో 96.58, బల్లికురవలో 96.7, సంతమాగులూరులో 96.73, జే పంగులూరులో 95.25, కొరిశపాడులో 97.36శాతం పంపిణీ చేసినట్లు ఎంపీడీవోలు తెలిపారు.



జే పంగులూరు బీసీ కాలనీలో పింఛను పంపిణీ చేస్తున్న మంత్రి గొట్టిపాటి

రేషన్ పంపిణీలో లోపాలకు తావివ్వద్దు

వేమూరు, న్యూస్‌టుడే: పేదలకు ప్రభుత్వం సరఫరా చేస్తున్న నిత్యావసరాల పంపిణీలో లోపాలకు తావు లేకుండా చూడాలని జిల్లా పౌరసరఫరాల అధికారి విలియమ్స్ తెలిపారు. నిత్యావసరాల పంపిణీని వేమూరులో ఆయన మంగళవారం పర్యవేక్షించారు. వాహనం వద్దకు వెళ్లి బియ్యం, పంచదార తూకాన్ని పరిశీలించారు. పంపిణీని వేగవంతం చేయాలని కోరారు. మండల ప్రత్యేకాధికారిగా ఉన్న ఆయన ముందుగా వేమూరులో పలువురు లబ్ధిదారులకు పింఛను అందించారు.



నిత్యావసరాల పంపిణీని పరిశీలిస్తున్న విలియమ్స్

ఆర్టీసీలో ఖాళీల భర్తీకి అనుమతివ్వాలి

రేపల్లె అర్బన్, న్యూస్‌టుడే: ఆర్టీసీలో 10 వేల ఖాళీ పోస్టులను భర్తీ చేసేందుకు ప్రభుత్వం తక్షణం అనుమతి ఇవ్వాలని ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు, ఏపీ జేఏసీ సాధారణ కార్యదర్శి పలిశెట్టి దామోదరరావు డిమాండ్ చేశారు. రేపల్లె వీరవల్లి కోటయ్య కల్యాణ మండపంలో మంగళవారం నిర్వహించిన ఎంప్లాయిస్ యూనియన్ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యోగ భద్రతపై గత ప్రభుత్వం రద్దు చేసిన సర్క్యులర్ 1/2109ను యథావిధిగా అమలు చేయాలన్నారు. 2022 నుంచి నిలిపేసిన నైట్ అవుట్, డేఅవుట్‌ను పునరుద్ధరించాలి, ప్రభుత్వ పరిశీలనలో ఉన్న పదోన్నతుల కేసు వెంటనే పరిష్కరించాలని కోరారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించేలోపే బస్సుల సంఖ్య పెంచాలన్నారు. ఎంప్లాయిస్ యూనియన్ సిద్ధాంతాల పట్ల ఆకర్షితులై చేరిన 60 మందిని సాదరంగా ఆహ్వానించారు. రాష్ట్ర సహాయ కార్యదర్శులు బీటీ వల్లి, జీఎస్ నారాయణ, బాపట్ల జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చిరంజీవి, శ్రీనివాసరావు, నాయకులు కమలాకరరావు, కేఎస్ రావు, చిట్టిబాబు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్టీసీ ఈయూ రాష్ట్ర అధ్యక్షుడు దామోదరరావు

నిమిషం ఆలస్యమైనా పరీక్షకు అనుమతించం

గుంటూరు, న్యూస్‌టుడే: జిల్లాలో ఈనెల మూడు నుంచి 21 తారీఖు వరకు జరగనున్న ఏపీ ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)కు 18,476 మంది హాజరుకానున్నారని డీఈవో శైలజ ఓ ప్రకటనలో తెలిపారు. నాలుగు కేంద్రాల్లో పరీక్ష ఆన్‌లైన్ విధానంలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఒక నిమిషం ఆలస్యమైనా పరీక్ష హాల్‌లోకి అనుమతి ఉండదని పేర్కొన్నారు. ఉదయం సెషన్ పరీక్ష 9.30 గంటలకు, మధ్యాహ్నం సెషన్ పరీక్ష 2.30 గంటలకు ఉంటుందని తెలిపారు. పరీక్ష నిర్దేశిత సమయానికి గంట ముందుగానే పరీక్ష కేంద్రం వద్దకు అభ్యర్థులు చేరుకోవాలని సూచించారు. పరీక్ష కేంద్రానికి ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరాలు, చరవాణిలకు అనుమతి లేదన్నారు. అభ్యర్థులు హాల్ టికెట్లుతోపాటు ఆధార్ గుర్తింపు కార్డు తెచ్చుకోవాలని సూచించారు.

జిల్లాలో నీటి అవసరాలు.. 28.21 టీఎంసీలు

బాపట్ల, న్యూస్‌టుడు: ఖరీఫ్ సీజన్‌లో జిల్లాలో 3.79 లక్షల ఎకరాల్లో పంటల సాగుకు 45.97 టీఎంసీల నీరు అవసరమైందని కలెక్టర్ వెంకట మురళి తెలిపారు. కలెక్టరేట్లో మంగళవారం నిర్వహించిన జిల్లా నీటి పారుదల సలహా మండలి సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆయకట్టు చివరి భూములకు సాగు నీరందేలా చూడాల్సిన బాధ్యత జలవనరుల శాఖ అధికారులపై ఉందన్నారు. ఇప్పటి వరకు 18 టీఎంసీల నీరు జిల్లాకు విడుదలైందన్నారు. ఏప్రిల్ వరకు మరో 28.21 టీఎంసీల నీరు కావాలని ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తామన్నారు. సాగు, మురుగునీటి కాలువల్లో పూడిక, తూటుకాడ, గుర్రపుడెక్క తొలగింపు పనులు, మరమ్మతులు శరవేగంగా చేపట్టాలని ఆదేశించారు. సాగర్ కాలువల్లో రూ.2.07 కోట్లతో 48 పనులు చేస్తున్నట్లు చెప్పారు. కృష్ణా పశ్చిమ డెల్టాలో తాత్కాలిక మరమ్మతుల కింద రూ.9.48 కోట్లు విడుదలైనట్లు తెలిపారు. అద్దంకి బ్రాంచి కాలువకు 18వ మైలు నుంచి నీటి విడుదల పెంచాలన్నారు. కేవలం 800 క్యూసెక్కుల నీరు మాత్రమే వస్తుండటంతో చివరి ఆయకట్టుకు అందటం లేదని రైతులు ఫిర్యాదు చేశారన్నారు. కారంచేడు మండలంలో 19,797 ఎకరాలకు సాగునీరు అందుతున్నా అధికారికంగా ఆయకట్టు నమోదు కాకపోవటంపై అధికారులను ప్రశ్నించారు. ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ మాట్లాడుతూ కాలువల కట్టలు పటిష్ఠం చేయాలన్నారు. బాపట్ల నియోజకవర్గంలో చివరి ఆయకట్టు ప్రాంతానికి సాగునీరు సక్రమంగా అందటం లేదని ఫిర్యాదు చేశారు. రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలని కోరారు. జేసీ ప్రఖర్ జైన్, డీఆర్వో సత్తిబాబు, జలవనరుల శాఖ ఎస్ఈ అభూ తలీమ్, ఈఈలు వెంకటరత్నం, మురళీకృష్ణ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకట మురళి, చిత్రంలో ఎమ్మెల్యే వేగేశన, జేసీ ప్రఖర్ జైన్



ఈ చిత్రంలోనిది స్టువార్టుపురం ఛానల్.. దీని పొడవు 18 కిలోమీటర్లు. దీన్ని 50 రోజుల కిందట రూ.9లక్షలతో బాగు చేశామని.. అధికారులు తెలుపుతుండగా.. కాలువను చూస్తే ఆ పరిస్థితి లేదని అన్నదాతలు అంటున్నారు. నీటి ప్రవాహానికి అడ్డుగా ఉన్న గుర్రపు డెక్క, పిచ్చిమొక్కలు, పడిపోయిన చెట్లు, గట్లమీద చెట్లు తొలగించలేదు. కాలువ తూటుకాడ, జమ్ము ఉండడంతో పై నుంచి నీరు సక్రమంగా పారడంలేదని కర్షకులు వాపోతున్నారు. దీనికితోడు బడా రైతులు కొందరు కాలువకు అడ్డుకట్ట వేసి తమ పొలాలకు నీరు మళ్లించుకుంటున్నారని, ఈవిషయం జలవనరుల శాఖాధికారులకు తెలిసినా పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఇకనైనా స్పందించి సాగునీరు విడుదలకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

అందని నీరు.. ఎండిన నారు

☛ ఆందోళనలో అన్నదాతలు
☛ ఇదీ పేరాల-చీరాల చిట్టివాద పొలాల దుస్థితి

చీరాల అర్బన్, న్యూస్‌టుడే

స్టువర్టుపురం కాలువ ఆయకట్టులో వేసిన ఓ పొలంలోని నారుమడి ఇది. నీరందక ఇలా పగుళ్లిచ్చింది. చీరాల నియోజకవర్గంలో పేరాల-చీరాల చిట్టివాద రైతు సంఘం పరిధిలో ఈ ఛానల్ కింద దాదాపు మూడు వేల ఎకరాలు ఉన్నాయి. ఏటా ఈ ప్రాంత రైతులు సాగునీటికి ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. ప్రస్తుత సీజన్‌లో 20 రోజుల క్రితం నారుమళ్లు పోశారు. కానీ కాలువలోకి నీరు అరడుగు కన్నా పారడం లేదు. ఫలితంగా దిగువన పోసినవి ఎండిపోతున్నాయి. కొందరైతే ఇంజిన్లు పెట్టి తడుపుకొంటున్నారు. ఆర్థిక స్థోమతలేని వారు బక్కెట్ల ద్వారా నీరు చల్లుకునే పరిస్థితి ఏర్పడడంపై అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



వాతావరణం అనుకూలించి సక్రమంగా నీరందితే ఇప్పటికే మూడొంతుల నాట్లు పడేవి... ఆ పరిస్థితి లేదు.. మరమ్మతులు చేశారంటున్న కాలువ గుర్రపు డెక్క, నాచుతో నిండిపోయింది.. నీరేమో కిందికి పారడంలేదు.. ఫలితం.. వేల రూపాయలు వ్యయం చేసి వేసిన నారుమళ్లు ఎండిపోతున్నాయి.. భూములు పగుళ్లిచ్చాయి. తమ పొలాల గురించి అధికారులు ఆలోచించాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఏటా ఇదే పరిస్థితి..



స్టువార్టుపురం ఛానల్‌కి అధికారులు సాగునీరు అందించడంలో విఫలమవుతున్నారు. ఏటా ఇదే పరిస్థితి నెలకొంటోంది. ఇప్పటికే నార్లు పోసి 20 రోజులైంది. నీరందక పొలాలు పగుళ్లిచ్చాయి. బతికించేందుకు నానా ఇబ్బందులు పడుతున్నాం. **- మల్లెల విజయ్‌కుమార్, రైతు**

అరడుగు నీరు లేదు



కాలువలో ప్రస్తుతం అరడుగు నీరు రావడం లేదు. దీనివల్ల నారుమళ్లు ఎండిపోతున్నాయి. ఇప్పటికే దుక్కి, విత్తనాలకు రూ.10 వేల వరకు వ్యయం చేశాం. ఏం చేయాలో అర్థం కావడంలేదు. దీనికితోడు కాలువలో ఎక్కడపడితే అక్కడ పిచ్చిమొక్కలు, నాచు ఉండడంతో నీరు దిగువకు రావడంలేదు. **- బోయిన రామకృష్ణ, రైతు**

నాచు, పిచ్చిమొక్కలు తొలగించాం

స్టువార్టుపురం ఛానల్‌లో 50 రోజుల క్రితమే నీటి ప్రవాహానికి అడ్డుగా ఉన్న నాచు, గుర్రపుడెక్క, తీగ ఆకును తొలగించాం. ఆతరువాత వర్షాలు పడ్డాయి. దీనివల్ల మళ్లీ పెరిగి ఉంటుంది. సమస్యను రైతులు మా దృష్టికి తెచ్చారు. దీని నివారణకు మందు చల్లిస్తాం. కాలువ గట్ల వెంట పెరిగిన చిల్లచెట్లు, వంగిపోయిన వాటిని తొలగించలేదని 'న్యూస్‌టుడే' ప్రశ్నించగా నీటి ప్రవాహానికి అడ్డుగా వచ్చే వాటిని మాత్రమే తొలగించాలనే ఆదేశాలున్నాయని చెప్పారు. **- ప్రవీణ్ కుమార్, జలవనరుల శాఖ ఏఈ, చీరాల**

జిల్లాలో 117 మద్యం దుకాణాలు

❖ లైసెన్స్‌ల జారీకి నోటిఫికేషన్ విడుదల
❖ జనాభా ఆధారంగా ఫీజు ఖరారు

బాపట్ల, న్యూస్‌టుడే

జిల్లాలో 117 మద్యం దుకాణాలకు లైసెన్స్‌ల జారీకి కలెక్టర్ వెంకట మురళి మంగళవారం రాత్రి నోటిఫికేషన్ విడుదల చేశారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్లో మద్యం దుకాణాల లైసెన్స్‌ల కోసం మంగళవారం నుంచే దరఖాస్తు చేసుకోవటానికి అవకాశం కల్పించారు. ఒక్కో దరఖాస్తుకు రూ.రెండు లక్షల చొప్పున నాన్ రిఫండబుల్ రుసుము చెల్లించాలి. ఒకే వ్యక్తి ఒక దుకాణం లేదా వేర్వేరు దుకాణాలకు ఎన్ని దరఖాస్తులైనా చేసుకోవచ్చు. డెబిట్, క్రెడిట్ కార్డులు లేదా బ్యాంకు చలానా రూపంలో దరఖాస్తు రుసుము చెల్లించాల్సి ఉంటుంది. డీడీ తీసి ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌లో నేరుగా అందించాలి. ఈ నెల 9 వరకు దరఖాస్తులు స్వీకరిస్తారు. పట్టణంలోని ఎంఎస్ఆర్ కల్యాణ మండపంలో జిల్లా కలెక్టర్ నేతృత్వంలో వచ్చిన దరఖాస్తుల నుంచి ఈనెల 11న లాటరీ తీసి లైసెన్స్‌లు కేటాయించనున్నారు. లైసెన్స్ దక్కించుకున్న వారు నిర్దేశిత రుసుములో తొలి వాయిదాను 24 గంటల్లోగా ప్రభుత్వానికి చెల్లించాలి. 12 నుంచి లైసెన్స్‌దారులు కొత్త దుకాణాలు ప్రారంభించాల్సి ఉంది. 2011 జనాభా ఆధారంగా ఏడాదికి లైసెన్స్ రుసుం నిర్ణయించారు. ఈ ఏడాది రిటైల్ ఎక్సైజ్ పన్ను కింద పది వేల లోపు జనాభాకు లైసెన్స్ ఫీజు రూ.50 లక్షలు, జనాభా 10 వేల నుంచి 50 వేల లోపు ఉన్న ప్రాంతాల్లో రూ.55 లక్షలు, 50 వేల పై నుంచి 5 లక్షల వరకు జనాభా ఉన్న ప్రాంతాల్లో రూ.65 లక్షలు, 5 లక్షల పైన జనాభాకు రూ.85 లక్షల ఫీజు చెల్లించాలని నిర్ణయించారు. తొలి రోజు దరఖాస్తులు ఏవీ రాలేదు. చీరాల పట్టణంలో అత్యధికంగా ఎనిమిది, బాపట్ల పట్టణంలో ఏడు, అద్దంకిలో అయిదు, రేపల్లెలో మూడు చొప్పున మద్యం దుకాణాలు ఏర్పాటు కానున్నాయి. పట్టణం, మండలం యూనిట్‌గా దుకాణాలు ఏర్పాటు కానున్నాయి. లైసెన్స్ దక్కించుకున్నవారు ఎక్కడైనా మద్యం దుకాణం ఏర్పాటు చేసుకోవటానికి అవకాశం కల్పిస్తారు. మూడు పట్టణాల పరిధిలోని 18 దుకాణాలకు వార్షిక లైసెన్స్ ఫీజు రూ.65 లక్షలుగా ఉండగా, అద్దంకి నగర పంచాయతీలో ఐదు దుకాణాలకు ఫీజును రూ.55 లక్షలుగా ఖరారు చేశారు. లాటరీలో ఎంపికైన దరఖాస్తుదారుడికి రెండేళ్ల చొప్పున లైసెన్స్ జారీ చేస్తారు. మొదటి ఏడాది రూ.55 లక్షల ఫీజు చెల్లించేవారు వచ్చే ఏడాది పది శాతం అదనంగా అంటే రూ.60.50 లక్షలు చెల్లించాల్సి ఉంది. రూ.65 లక్షలు తొలి ఏడాది చెల్లించేవారు రెండో ఏడాది రూ.71.50 లక్షలు చెల్లించాలి. జిల్లాలో రూ.50 లక్షల కేటగిరీ మద్యం దుకాణాలు లేవు.



జిల్లా ఆబ్కారీ శాఖ కార్యాలయం

❖ దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం: మంగళవారం ఉదయం 10 గంటల నుంచి
❖ దరఖాస్తుల స్వీకరణకు తుది గడువు: ఈ నెల 9 వరకు
❖ లాటరీ తీసి లైసెన్స్‌లు ఖరారు చేసేది: ఈ నెల 11
❖ అనుమతులు పొందిన వారు దుకాణాలు ప్రారంభించే తేదీ: ఈ నెల 12
❖ జిల్లాలో మొత్తం దుకాణాలు: 117
❖ రూ.55 లక్షల వార్షిక ఫీజు కలిగిన దుకాణాలు: 36
❖ రూ.65 లక్షల వార్షిక ఫీజు కలిగిన దుకాణాలు: 81

దసరా ఉత్సవాలు... ట్రాఫిక్ మళ్లింపు

విజయవాడ మీదుగా నడిచే వాహనాల రాకపోకల్లో మార్పులు

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే : విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై దసరా ఉత్సవాల సందర్భంగా.. నగరం మీదుగా వెళ్లే వాహనాలను దారి మళ్లిస్తున్నట్లు ఎన్టీఆర్ పోలీస్ కమిషనరేట్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు తెలిపారు. ఈ నెల 2 నుంచి 13వ తేదీ వరకు ఈ మళ్లింపులు ఉంటాయని మంగళవారం ఆయన ఓ ప్రకటనలో వెల్లడించారు.

భారీ, చిన్న వాహనాలు ఇలా వెళ్లాలి..


✦ హైదరాబాద్ నుంచి చెన్నై వెళ్లే భారీ వాహనాలను నార్కెట్‌పల్లి, నల్గొండ, మిర్యాలగూడ, నడికూడి, పిడుగురాళ్ల, అద్దంకి, మేదరమెట్ల మీదుగా చెన్నైకు మళ్లిస్తారు. చిన్న వాహనాలను ఇబ్రహీంపట్నం, గొల్లపూడి, స్వాతి కూడలి, కనకదుర్గా పైవంతెన, కృష్ణలంక, కనకదుర్గమ్మ వారధి, తాడేపల్లి మీదుగా చెన్నైకు మళ్లిస్తారు. తిరుగు ప్రయాణంలో ఇదే మార్గంలో వెను తిరుగుతాయి.

✦ హైదరాబాద్ నుంచి విశాఖపట్నం వెళ్లే భారీ వాహనాలను.. ఇబ్రహీంపట్నం, జి.కొండూరు, మైలవరం, నూజివీడు, హనుమాన్ జంక్షన్, ఏలూరు మీదుగా విశాఖపట్నం వైపు మళ్లిస్తారు. అదే విధంగా చిన్న వాహనాలను ఇబ్రహీంపట్నం, గొల్లపూడి వై.కూడలి, కబేళా సెంటర్, సీవీఆర్ పైవంతెన, పైపులరోడ్డు, కండ్రిక, బోడపాడు ఆర్‌యూబీ, ఔటర్ రింగ్ రోడ్డు, ముస్తాబాద, చిన అవుటపల్లి మీదుగా విశాఖపట్నం మళ్లిస్తారు. తిరుగు ప్రయాణంలో ఇదే మార్గంలో వెను తిరుగుతాయి.

✦ విశాఖపట్నం నుంచి చెన్నై వెళ్లే భారీ వాహనాలను హనుమాన్‌జంక్షన్, గుడివాడ, పామర్రు, అవనిగడ్డ, పెనుమూడి వారధి, రేపల్లె, చీరాల, ఒంగోలు మీదుగా చెన్నైకు మళ్లిస్తారు. చిన్న వాహనాలను గన్నవరం, నిడమానూరు, బెంజిసర్కిల్, కనకదుర్గమ్మ వారిధి మీదుగా చెన్నైకు పంపిస్తారు. రామవరప్పాడు వద్ద ట్రాఫిక్ రద్దీ పెరిగితే.. తాడిగడప 100 అడుగుల రోడ్డు మీదుగా బందరు రోడ్డు, అక్కడి నుంచి బెంజిసర్కిల్ మీదుగా మళ్లిస్తారు. తిరుగు ప్రయాణంలో ఇదే మార్గంలో వెనుతిరుగుతాయి.

✦ గుంటూరు నుంచి విశాఖపట్నం వెళ్లే భారీ వాహనాలను బుడంపాడు, తెనాలి, పెనుమూడి వారధి, అవనిగడ్డ, పామర్రు, గుడివాడ, హనుమాన్ జంక్షన్ మీదుగా ఏలూరు, విశాఖపట్నం వైపు మళ్లిస్తారు. చిన్న వాహనాలను గుంటూరు, కనకదుర్గమ్మ వారిధి, బెంజిసర్కిల్ పైవంతెన, రామవరప్పాడు, నిడమానూరు, గన్నవరం మీదుగా మళ్లిస్తారు. తిరుగు ప్రయాణంలో ఇదే మార్గంలో వెనుతిరుగుతాయి.

త్వరలో మచిలీపట్నం-రేపల్లె రైల్వే లైన్ నిర్మాణం



ప్రతిపాదిత రైల్వేలైన్ మ్యాప్ చూపిస్తున్న ఎంపీ బాలశౌరి

మచిలీపట్నం, న్యూస్‌టుడే: జిల్లా ప్రజల చిరకాల వాంఛగా ఉన్న మచిలీపట్నం-రేపల్లె రైల్వే నిర్మాణానికి ముందడుగులు పడుతున్నాయని ఎంపీ వల్లభనేని బాలశౌరి స్పష్టం చేశారు. రహదారులు, భవనాల శాఖ అతిథి గృహంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బందరు పోర్టుతో పాటు, రేపల్లె రైల్వే నిర్మాణం కోసం ఎన్నో ఉద్యమాలు చేసిన విషయాన్ని ప్రస్తావిస్తూ తాను ఎంపీగా ఉన్న సమయంలోనే పోర్టు పనులు ప్రారంభమయ్యాయన్నారు. ఎన్నికల సందర్భంగా నూతన రైల్వే లైన్ కోసం ఇచ్చిన హామీ మేరకు కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినివైష్ణవ్‌ను పలుమార్లు కలిసి ప్రాజెక్టు గురించి చర్చించి ఒప్పించామన్నారు. తొలుత మచిలీపట్నం నుంచి రేపల్లె వరకు లైన్ ఏర్పాటు చేయాలని భావించినా మచిలీపట్నం నుంచి చల్లపల్లి, భట్టిప్రోలు, నిడుబ్రోలు మీదుగా బాపట్ల వరకు పొడిగించాలని మంత్రికి విజ్ఞప్తి చేయడంతో ఆయన సానుకూలంగా స్పందించారన్నారు. నర్సాపురం నుంచి మచిలీపట్నంకు రైల్వే లైన్ నిర్మాణానికి ఇప్పటికే ఆదేశాలు జారీ అయ్యాయని, బాపట్ల వరకు మరో లైన్ ఏర్పాటు చేస్తే సముద్ర తీరంలో రైల్వే లైన్ ఏర్పాటు చేసినట్లవుతుందన్నారు ఈ మార్గం ప్రయాణికులకే కాక సరకు రవాణాకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. బాపట్ల వరకు ఏర్పాటు చేసే రైల్వే లైన్ హౌరా-చెన్నై ట్రంక్ లైన్‌కు అనుసంధానం అవుతుందని, ఫలితంగా అంత్యంత రద్దీగా ఉండే విజయవాడ రైల్వే జంక్షన్‌పై భారం తగ్గుతుందన్నారు. నూతన లైన్ కోసం ముందుగా సర్వే చేసి డీపీఆర్ సిద్ధం చేయాలని చెబుతూ ఇవి వేగవంతంగా పూర్తిచేసేలా తగు కృషి చేస్తానని చెప్పారు. సమావేశంలో జనసేన నాయకులు బండి రామకృష్ణ, మాదివాడ రాము, గళ్లా తిమోతి, చౌదరి, తదితరులు పాల్గొన్నారు.

రోగుల తరలింపులో నిర్లక్ష్యం వలదు



వాహనం వద్ద వైద్యాధికారి

చీరాల, మార్టూరు, న్యూస్‌టుడే: అత్యవసర పరిస్థితుల్లో రోగులను వైద్యశాలకు తరలించే విషయంలో ఎట్టిపరిస్థితుల్లోనూ నిర్లక్ష్యం వహించరాదని ఎన్టీఆర్ వైద్య సేవ జిల్లా సమన్వయకర్త డాక్టర్ సీహెచ్ ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు. ప్రవీణ్ కుమార్ మంగళవారం చీరాల ప్రభుత్వ వైద్యశాల ప్రాంగణంలో చీరాల, ఇంకొల్లు, చినగంజాం 108 వాహనాలను తనిఖీ చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ కాల్ సెంటర్ నుంచి ఫోన్ వచ్చిన 20 నిమిషాల్లో రోగిని వైద్యశాలకు చేర్చాలని సూచించారు. రోగి ఉన్న ప్రాంతానికి చేరుకున్న వెంటనే అవసరమైన ముందస్తు చికిత్స అందజేస్తూ తీసుకురావాలన్నారు. తరువాత రికార్డులు పరిశీలించారు. 108 జిల్లా మేనేజర్ బాలకృష్ణ తదితరులు ఉన్నారు.

✦ మార్టూరు-2 పరిధిలోని 104లో ఉన్న పరికరాలు, మందులు, ల్యాబ్ పరీక్షలను పరిశీలించారు. రోగులకు అందుతున్న వైద్యసేవలపై అడిగి తెలుసుకున్నారు. వైద్యులు నవీన, జిల్లా మేనేజర్ కె.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్ల వలలో చిక్కొద్దు



మాట్లాడుతున్న ఎస్పీ తుషార్ డూడీ

బాపట్ల, న్యూస్‌టుడే: సైబర్ నేరగాళ్ల మాయమాటలు నమ్మి వలలో చిక్కుకుని కష్టపడి సంపాదించిన సొమ్మును పోగొట్టుకోవద్దని ఎస్పీ తుషార్ డూడీ హితవు పలికారు. తన క్యాంపు కార్యాలయంలో ఆయన మంగళవారం మాట్లాడారు. ప్రజల అత్యాశే సైబర్ మోసగాళ్లకు ఆయుధమన్నారు. సులభంగా నగదు సంపాదించాలన్న ఆశతో www.iasindia.com వంటి వెబ్‌సైట్ల ద్వారా సైబర్ నేరాలు పాల్పడుతున్న వారి చేతికి చిక్కి రూ.వేల నుంచి రూ.లక్షల వరకు నగదు పోగొట్టుకుంటున్నారని తెలిపారు. నగదు ఎవరికీ ఊరికే రావన్నారు. అపరిచిత వెబ్‌సైట్స్, ఏపీకే ఫైల్స్ క్లిక్ చేయరాదన్నారు. సైబర్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఏదైనా సైబర్ నేరం జరిగితే వెంటనే 1930 నంబరుకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. వెంటనే ఫిర్యాదు చేస్తే పోగొట్టుకున్న సొమ్ములో చాలా వరకు రికవరీ చేయటానికి అవకాశం ఉంటుందన్నారు. సైబర్ నేరగాళ్లు తొలుత చిన్న చిన్న టాస్క్‌ల పేరుతో నగదు ఇచ్చి తర్వాత పెద్ద మొత్తంలో వసూలు చేసి మోసానికి పాల్పడతారని హెచ్చరించారు. ఆన్‌లైన్‌లో .జరిగే మోసాల పట్ల అందరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రజల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని మోసాలు చేస్తున్నారని పేర్కొన్నారు.

98 శాతం పింఛన్ల అందజేత



నందిరాజుతోటలో వృద్ధురాలికి పింఛన్ నగదు అందజేస్తున్న ఆర్డీవో గ్లోరియా, తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి తాతా జయప్రకాష్ నారాయణ

మొత్తం లబ్ధిదారుల
సంఖ్య: 2,30,431
తొలి రోజు పింఛను నగదు అందుకున్న లబ్ధిదారుల
సంఖ్య: 2,26,458
పంపిణీకి విడుదల చేసిన
నగదు: రూ.95.94 కోట్లు
పంపిణీ చేసిన
నగదు: రూ.94.30 కోట్లు

బాపట్ల, న్యూస్‌టుడే: నిరుపేదల జీవితంలో వెలుగులు నింపటమే ధ్యేయంగా ఎన్టీఆర్ భరోసా పథకం కింద ప్రతి నెలా 1న రూ.4 వేలు చొప్పున ప్రభుత్వం పింఛను అందిస్తోందని జేసీ ప్రఖర్‌జైన్ అన్నారు. జిల్లాలో నాలుగు పురపాలక సంఘాలు, 25 మండలాల్లో ఎన్టీఆర్ భరోసా పింఛన్లను లబ్ధిదారులకు తొలి రోజు మంగళవారం 98 శాతం పంపిణీ చేశారు. మండల పరిధిలోని ముత్తాయపాలెంలో జేసీ ప్రఖర్‌జైన్, నందిరాజుతోటలో ఆర్డీవో గ్లోరియా పింఛన్ల పంపిణీని ప్రారంభించారు. పురపాలక సంఘంలో ప్రత్యేకాధికారి, జిల్లా బీసీ సంక్షేమాధికారి శివలీల, కమిషనర్ నిర్మల్‌కుమార్ పింఛన్ల నగదు అందజేశారు. జేసీ మాట్లాడుతూ అర్హులందరికీ పింఛన్లు అందుతున్నాయన్నారు. 80 శాతం వైకల్యం కలిగిన వారికి నెలకు రూ.15 వేల చొప్పున పింఛను అందిస్తున్నట్లు తెలిపారు. ఆర్డీవో గ్లోరియా మాట్లాడుతూ ఎన్టీఆర్ భరోసా పింఛన్ల ద్వారా పేదలకు ఆర్థిక భద్రత లభించిందన్నారు. తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి తాతా జయప్రకాష్ నారాయణ, ఇన్‌ఛార్జి తహసీల్దారు శ్రీదేవి, తెదేపా నేతలు పాల్గొన్నారు.

664 బస్తాల రేషన్ బియ్యం స్వాధీనం

వెదుళ్లపల్లిలోని రైస్‌మిల్లులో అధికారుల దాడులు



స్వాధీనం చేసుకున్న బియ్యం వద్ద పౌరసరఫరాల డీటీ ఓంకారం

బాపట్ల: మండల పరిధిలోని వెదుళ్లపల్లిలో శ్రీనివాస అయ్యప్ప రైస్ ట్రేడర్స్‌లో రేషన్ బియ్యం అక్రమంగా నిల్వ చేశారన్న సమాచారంతో పౌరసరఫరాల డీటీ ఓంకార్ ఆధ్వర్యంలో అధికారులు మంగళవారం రాత్రి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. రైస్‌మిల్లులో అక్రమంగా నిల్వ చేసిన 25 కిలోల చొప్పున 400 బస్తాల రేషన్ బియ్యం, 50 కిలోల 264 బస్తాల నూకలు స్వాధీనం చేసుకున్నారు. రైస్‌మిల్లు నిర్వాహకులు కోటా శ్రీనివాసరెడ్డి, వక్కలగడ్డ సుధీర్‌పై కేసులు నమోదు చేసినట్లు డీటీ ఓంకార్ తెలిపారు. గతంలో ఇదే రైస్‌మిల్లు నుంచి భారీగా రేషన్ బియ్యం ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. డీలర్ల ద్వారా అక్రమంగా రేషన్ బియ్యం కొనుగోలు చేసి మళ్లీ మర ఆడించి ఎవరికీ అనుమానం రాకుండా కొత్త బస్తాల్లో నింపి బడా వ్యాపారులకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారనే విమర్శలున్నాయి.

శిరస్త్రాణం తప్పనిసరి

బాపట్ల, కర్లపాలెం, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదాల సమయంలో శిరస్త్రాణం ధరించి ఉన్న వారు ప్రాణాలు కాపాడుకోవచ్చని డీఎస్పీ జి.రామాంజనేయులు అన్నారు. బాపట్లలో వాహనదారులకు మంగళవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. శిరస్త్రాణం ధరించకుండా వాహనాలు నడిపితే రోడ్డు ప్రమాదాల్లో తీవ్ర గాయాలై ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. ప్రమాదాల్లో 90 శాతం మరణాలు శిరస్త్రాణం ధరించకపోవటం వల్లే జరుగుతున్నాయని తెలిపారు. నిర్లక్ష్యంగా వాహనాలు నడిపే వారిపై జరిమానా విధిస్తామన్నారు. సీఐలు అహ్మద్ జానీ, హరికృష్ణ, గంగాధర్, ఎంఈఐ రంగారావు పాల్గొన్నారు. కర్లపాలెం ఐలాండు కూడలిలో శిరస్త్రాణంపై అవగాహన సదస్సు నిర్వహించారు. 'ట్రాఫిక్ నిబంధనలు పాటించండి- సురక్షితంగా గమ్యాన్ని చేరండి' అంటూ నినాదాలు చేస్తూ ప్రదర్శన నిర్వహించారు. మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు. బాపట్ల రూరల్ సర్కిల్ సీఐ హరికృష్ణ, ఎస్సై రవీంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

షూటింగ్‌లో బంగారు పతకం

కర్లపాలెం, న్యూస్‌టుడే: మండలంలో చింతాయపాలెం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి షూటింగ్ పోటీలకు ఎంపికయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తోట వెంకటరాజు, పీడీ గోపి తెలిపారు. గుంటూరులోని ఇండియన్ షూటింగ్ అకాడమీలో ఈనెల 1న నిర్వహించిన ఓపెన్ సైట్ షూటింగ్ పోటీల్లో 9వ తరగతి చదువుతున్న పిట్టు చిన్నఅయ్యప్పరెడ్డి, దిద్ల బాలమణికంఠరెడ్డి అత్యంత ప్రతిభ కనబరిచి బంగారు పతకం సాధించారని పేర్కొన్నారు. రాజమండ్రిలో ఈనెల 18 నుంచి 20 వరకు జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని వివరించారు.



సత్తా చాటిన బాలురు

బ్రాయిలర్ ధరలు

(కిలో కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 121, రిటైల్ ధర - 143, చికెన్ విత్‌స్కిన్ - 207, చికెన్ స్కిన్‌లెస్ - 236.

కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -116 రిటైల్ ధర 138 చికెన్ విత్ స్కిన్ - 200, చికెన్ స్కిన్‌లెస్ - 228.

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 123, 132, 142 చికెన్ విత్ స్కిన్ - 230 చికెన్ స్కిన్‌లెస్ - 240.

నెక్ సూచించిన కోడిగ్రుడ్లు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 535 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.84/-.

తెదేపా కార్యకర్త ఆత్మహత్యాయత్నం

వైకాపా వేధింపులు తట్టుకోలేక నిర్ణయం



వెంకటేశ్వరరెడ్డి

తాడేపల్లి, న్యూస్‌టుడే: వైకాపా నాయకుల వేధింపులు తట్టుకోలేక తెదేపా కార్యకర్త ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన ఘటన చోటు చేసుకుంది. తాడేపల్లి పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. బాపట్ల జిల్లా చీరాల మండలం కావూరివారిపాలెం పంచాయతీ పరిధిలో బుగ్గలవారిపాలేనికి చెందిన వెంకటేశ్వరరెడ్డి, స్థానికంగా ఉన్న వైకాపా నాయకులు మధ్య వినాయక చవితి సందర్భంగా వివాదం ఏర్పడింది. దీంతో వైకాపా నాయకులు వెంకటేశ్వరరెడ్డిని గ్రామంలో బహిష్కరించారు. ఎవరూ అతడితో మాట్లాకూడదని, అతడి కిరాణా దుకాణంలో వస్తువులు కొనుగోలు చేయవద్దని తీర్మానించారు. దీంతో మనస్తాపానికి గురైన అతడు విషయాన్ని మంత్రి లోకేశ్‌కు వివరించేందుకు గుంటూరు జిల్లా ఉండవల్లి నివాసంలో మంగళవారం ఉదయం జరిగిన 'ప్రజా దర్బార్' కార్యక్రమానికి భార్య, కుమారుడితో కలిసి వచ్చారు. వినతి ఇచ్చేందుకు క్యూలో నిలబడ్డారు. ఇంతలో ఇప్పుడే వస్తానని బయటకు వెళ్లిన వెంకటేశ్వరరెడ్డి కొద్దిసేపటి తరువాత తిరిగి వచ్చారు. గ్రామంలో జరిగిన అవమానాన్ని భరించలేక పురుగుమందు తాగానని కుటుంబ సభ్యులకు తెలిపారు. వెంటనే కుమారుడు సమరసింహారెడ్డి అక్కడే ఉన్న పోలీసులకు విషయం చెప్పగా..108 అంబులెన్స్‌లో బాధితుడిని విజయవాడ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రస్తుతం అతని ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగా ఉందని కుమారుడు తెలిపాడు. ఈ ఘటనపై తాడేపల్లి పోలీసులు పూర్తి వివరాలు సేకరించి విచారణ చేస్తున్నారు.

మధ్యాహ్న భోజన పథకంపై ఆరా

ఈనాడు కథనానికి స్పందన

చీరాల అర్బన్, న్యూస్‌టుడే: కస్తూర్బా గాంధీ మున్సిపల్ బాలికోన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న భోజన పథకంపై అధికారులు ఆరా తీస్తున్నారు. దీనిలో భాగంగా డిప్యూటీ డీఈవో అబ్బురాజు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పాఠశాలకు వెళ్లి విద్యార్థుల తల్లిదండ్రులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటుచేశారు. భోజన పథకం నిర్వహణపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. గత నెల 26న 'ఈనాడు'లో 'విద్యార్థులు 850...భోజనం తీసుకునేవారు 150' అనే శీర్షికతో కథనం వెలువడింది. దీంతో విద్యాశాఖాధికారులు స్పందించి దీనిపై పూర్తి విచారణ చేపట్టారు. రెండు రోజుల క్రితం విద్యార్థుల తల్లిదండ్రుల కమిటీ ఆధ్వర్యంలో కుకింగ్ ఏజెన్సీ నిర్వాహకులను మార్చాలని ఎంఈవో సుబ్రహ్మణేశ్వరరావుకు ఫిర్యాదు చేయడం గమనార్హం.

రైతుల ఆశలను నిండా ముంచేశాయి!



వెదుళ్లపల్లి వంతెన వద్ద పేరలి డ్రెయిన్‌లో మురుగునీటి ప్రవాహానికి అడ్డుగా నిలిచిన పిచ్చిమొక్కలు

బాపట్ల పట్టణం, న్యూస్‌టుడే: రైతుల ఆశలను ఈ ఏడాది డ్రెయిన్లు నిలువునా ముంచేశాయి. ఎక్కడికక్కడ గుర్రపుడెక్క, తూటుకాడ పేరుకుపోవటం, పూడికతీత పనులు చేపట్టకపోవటంతో వర్షాలు కురిసినప్పుడు మురుగు నీరు సరిగా పారక పొలాలను ముంచెత్తి రైతులను నష్టాల ఊబిలోకి నెట్టింది. గడిచిన అయిదేళ్లలో వైకాపా ప్రభుత్వం రైతుల ప్రధాన అవసరాలైన నీటి పారుదల కాలువలపై దృష్టిపెట్టకపోవటంతో వేలాది ఎకరాలు వరి, వాణిజ్య పంటలు వరద ముంపునకు గురయ్యాయి. ఎన్నడూ లేనంతగా ఈ ఏడాది భారీ వర్షాలు, వరదలకు మండల పరిధిలోని కంకటపాలెం, జమ్ములపాలెం, నరసాయపాలెం గ్రామాల రైతులు నష్టాలను చవిచూశారు. ఈ గ్రామాల రైతులు తమ పొలాల్లోని మురుగు నీటిని కంకటపాలెం గ్రామంలో కాలువల ద్వారా వెదుళ్లపల్లి సమీపంలోని పేరలి డ్రెయిన్‌కు మళ్లిస్తారు. ఈ డ్రెయిన్‌లో నీటి ప్రవాహానికి పిచ్చిమొక్కలు ఆటంకంగా ఉన్నాయి. వెద దశలో పంటలు నష్టపోతే మళ్లీ నాట్లు వేసుకుంటున్నామని, వరిపైరు దుబ్బు కట్టి పొట్ట పోసుకునే సమయంలో వర్షాలు కురిస్తే మురుగునీరు పోయేందుకు వీలు లేకుండా పోతుందని, మరింతగా నష్టాలను చవిచూడాల్సి వస్తోందని, ఇప్పటికైనా అధికారులు డ్రెయిన్లలో పూడికతీత పనులు చేపట్టాలని గ్రామాల రైతులు కోరుతున్నారు. ఈ విషయమై మురుగునీటి పారుదలశాఖ ఏఈ షేక్ ఖాదర్‌బీని సంప్రదించగా గడిచిన అయిదేళ్లుగా డ్రెయిన్లలో పూడికతీత పనులకు ప్రతిపాదనలు పంపుతున్నామని, నిధులు మంజూరు కాగానే పనులు చేపడతామని తెలిపారు.

గొర్రెల కాపరి ఆత్మహత్య

చీరాల అర్బన్, న్యూస్‌టుడే: గొర్రెల కాపరి ఒకరు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన చీరాల ఒకటో పట్టణ పోలీసు స్టేషను పరిధిలో మంగళవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... బాపట్ల మండలం కర్లపాలేనికి చెందిన మరక ఏసయ్య (45) చీరాల మండలం గవినివారిపాలేనికి చెందిన నక్కల వెంకట్రావు వద్ద గొర్రెల కాపరిగా పనిచేస్తున్నారు. మంగళవారం ఉదయం వాటిని తోలుకుని కొత్తపాలెం సమీపంలోకి వెళ్లారు. ఆతరువాత ఏమైందో తెలియదు.. అక్కడ ఓ చెట్టుకు ప్లాస్టిక్ తాడుతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుని మృతిచెందారు. సహచర గొర్రెల కాపరులు చూసి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. ఘటనా స్థలంలో మృతుడి కాళ్లు నేలకు తాకి ఉండటంతో పోలీసులు దీన్ని అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. ఈమేరకు సీఐ మారీదు శ్రీనివాసరావు తెలిపారు.

బాపట్ల

•బాపట్ల • రేపల్లె • వేమూరు

విద్యార్థులకు రాత పుస్తకాల అందజేత



పుస్తకాలను పంపిణీ చేస్తున్న న్యాయమూర్తి వెంకటేశ్వర్లు

భట్టిప్రోలు, న్యూస్‌టుడే: ఇటీవల కృష్ణానదికి వచ్చిన వరద ప్రభావంతో మండలంలోని ఓలేరు పల్లెపాలెం విద్యార్థులు పుస్తకాలను నష్టపోయారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్ టి.లీలావతి ఆదేశాల మేరకు మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయమూర్తి టి.వెంకటేశ్వర్లు రాత పుస్తకాలను విద్యార్థులకు మంగళవారం పంపిణీ చేశారు.

ఉచిత న్యాయసేవ

బాపట్ల: ఉచిత న్యాయ సేవ కోసం పేదలు, మహిళలు, దివ్యాంగులు 15100కి ఫోన్ చేయాలని మండల న్యాయసేవాధికార సంస్థ వాలంటీర్ పఠాన్ మహమ్మద్ ఖాన్ తెలిపారు. జిల్లా, మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఉచిత న్యాయ సేవలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ వాలంటీర్లు పట్టణంలో ప్లకార్డులు, కరపత్రాలు మంగళవారం ప్రదర్శించారు.

బండ్లమ్మకు తెలంగాణ మాజీ ఎంపీ పూజలు

చందోలు(పిట్టలవానిపాలెం), న్యూస్‌టుడే: చందోలు శ్రీబండ్లమ్మను తెలంగాణ రాష్ట్రం పెద్దపల్లి మాజీ ఎంపీ గోర్లకుంట వెంకటేష్ ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయానికి సంబంధించిన పలు విశేషాలను తన కంపెనీలో పనిచేస్తున్న చందోలుకు చెందిన వ్యక్తి ద్వారా తెలుసుకుని వచ్చనన్నారు. ఆలయ ఇన్‌ఛార్జి ఈవో నరసింహమూర్తి ఆలయ విశేషాలను వివరించి అమ్మవారి చిత్రపటం ఇచ్చి సత్కరించారు. కార్యక్రమంలో పారిశ్రామికవేత్తలు పొనుగోటి శ్రీనివాసరావు, జోగినపల్లి రాజేష్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఎదురుచూపులకు మోక్షం!

- ప్రతి ఇంటికీ నీటి సరఫరా దిశగా అడుగులు
- పురపాలక సంఘానికి అమృత్ 2.0 నిధుల కేటాయింపు
- రూ.20.23 కోట్లతో పనులు చేపట్టేందుకు ప్రతిపాదన

బాపట్ల, న్యూస్‌టుడే

జిల్లా కేంద్రం బాపట్లలో ప్రతి ఇంటికీ కుళాయి ద్వారా తాగునీరు అందించటానికి ప్రభుత్వం అమృత్ 2.0 పథకం కింద రూ.20.23 కోట్లు కేటాయించింది. కొత్తగా ఓవర్‌హెడ్ ట్యాంకులు, పైప్‌లైన్ల నిర్మాణం చేపట్టేందుకు అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ప్రజారోగ్య శాఖ ద్వారా త్వరలో టెండర్లు పిలిచి పనులు ప్రారంభించనున్నారు. పనులు పూర్తయితే శివారు కాలనీలు, పీఎంఏవై-ఎన్టీఆర్ కాలనీ వాసులు ట్యాంకర్ల నీటి కోసం ఎదురు చూడాల్సిన అవసరం ఉండదు.

వైకాపా హయాంలో నిర్లక్ష్యం

పట్టణంలోని రైలుపేటలో ఎనిమిది వార్డులు, 28 వేల మంది జనాభా ఉన్నారు. ఉప్పరపాలెం, రెడ్డిపాలెం, శాంతినగర్, శారదాపురికాలనీ, వెన్నెల కంటి నగర్, బావాజీతోట, రామకృష్ణాపురం ఎస్సీ కాలనీ ప్రాంతాలకు కుళాయిల ద్వారా నీరందటం లేదు. పంపులు అమర్చితేనే నీరొస్తోంది. 2016లో తెదేపా ప్రభుత్వ హయాంలో రూ.2కోట్లతో ఉప్పరపాలెం వద్ద ఓవర్ హెడ్ ట్యాంకు నిర్మించారు. వైకాపా ప్రభుత్వం దీనిని వినియోగంలోకి తీసుకు రాలేదు. ఉప్పరపాలెం ఓవర్ హెడ్ ట్యాంకు నుంచి కాలనీకి పైప్ లైన్లు వేసే పనులు అసంపూర్తిగా వదిలేశారు. మూలపాలెం పీఎంఏవై-



ఉప్పరపాలెంలో నిర్మించిన ఓవర్‌హెడ్ ట్యాంకు

- బాపట్ల జనాభా: 1.07 లక్షలు
- రోజూ సరఫరా చేస్తున్న తాగునీరు: 6.5 ఎంఎల్‌డీ
- కొళాయిల ద్వారా నీరందని కాలనీలు: 12
- ప్రస్తుతం ఓవర్ హెడ్ ట్యాంకులు: 5
- కొత్తగా నిర్మాణానికి ప్రతిపాదిస్తున్న ఓవర్ హెడ్ ట్యాంకులు: 4

ఎన్టీఆర్ కాలనీలో కొత్తగా 297 ఇళ్లు నిర్మించారు. 743 గృహాలు వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయి. కాలనీకి నీరు అందించటానికి జల్‌జీవన్ మిషన్ నుంచి రూ.4 కోట్లు కేటాయించారు.

నాలుగైదురోజులకోసారి..

ప్యాడిసన్‌పేట, ఏకేనగర్, ఏఆర్ నగర్, దేవుడిమాన్యం, గులాంహుస్సేన్‌తోట, డ్రైవర్స్‌కాలనీ, బాలకృష్ణాపురం, దరివాదకొత్తపాలెం, ఇమ్మడిశెట్టిపాలెం, డ్రైవర్స్‌కాలనీ, భావపురి కాలనీ, ఆనందనగర్, వైఎస్సార్ నగర్, రాజీవ్‌నగర్ కాలనీ, ఇందిరానగర్ కాలనీ, పడమర సత్రం యాదవపాలెం, ఉమ్మారెడ్డి సరోజినీదేవి కాలనీ, పెయింటర్స్‌కాలనీ, దర్శిపెద మస్తాన్‌నగర్ ప్రాంతాలకు కొళాయిల ద్వారా నీరు అందటం లేదు. టీచర్స్ కాలనీ, బేతనీకాలనీ వద్ద పీఎంఏవై-ఎన్టీఆర్ కాలనీల్లో నిర్మించిన గృహాలకు తాగునీటి సౌకర్యం లేదు. ప్రస్తుతం మూడు ట్యాంకర్ల ద్వారా శివారు కాలనీలకు అరకొరగా తాగునీరు అందిస్తున్నారు. నాలుగైదు రోజులకొకసారి నీరొస్తోంది.



ట్యాంకర్ వద్ద నీరు పట్టుకుంటున్న శివారు ప్రాంత వాసులు

పనుల పూర్తికి రెండేళ్లు

అమృత్ 2.0 పథకం కింద రూ.20.23 కోట్లను పురపాలక సంఘానికి కేటాయించారు. ఈ నిధులతో పట్టణంలో కొత్తగా ప్యాడిసన్‌పేట, పెయింటర్స్ కాలనీ, బేతనీకాలనీ, డ్రైవర్స్ కాలనీలో నాలుగు చోట్ల కొత్తగా 800 కేఎల్ సామర్థ్యంతో నాలుగు ఓవర్ హెడ్ ట్యాంకులు నిర్మించాలని ప్రతిపాదించారు. ఉప్పరపాలెంలో ఇప్పటికే నిర్మించిన ఓవర్‌హెడ్ ట్యాంకును పైప్‌లైన్ల ద్వారా అనుసంధానం చేయటానికి కొత్తగా పైప్‌లైన్లు వేయనున్నారు. కొత్త కాలనీలకు పైప్‌లైన్లు నిర్మించి ఓవర్‌హెడ్ ట్యాంకుల ద్వారా తాగు నీరందించేలా ప్రణాళికలు రూపొందించారు. ఈ పనులు పూర్తి చేయటానికి రెండేళ్ల సమయం పడుతుంది. ప్రతి ఇంటికి కొళాయి ద్వారా నీరు సరఫరా చేయాలన్న లక్ష్యం నెరవేరుతుంది.

స్వర్ణ బాపట్ల విజన్ రూపొందిస్తున్నాం

స్వర్ణ బాపట్ల విజన్‌లో భాగంగా ప్రతి ఇంటికీ కుళాయి ద్వారా తాగునీరు అందించాలని ప్రణాళికలు రూపొందిస్తున్నాం. అమృత్ 2.0 పథకం కింద మంజూరైన నిధులతో కొత్త ఓవర్‌హెడ్ ట్యాంకులు, పైప్‌లైన్లు నిర్మిస్తాం. పట్టణంలో నీటి సమస్య లేకుండా చర్యలు తీసుకుంటాం.

– నిర్మల్‌కుమార్, పురపాలక కమిషనర్

నగరం ఎక్సైజ్ సీఐగా శ్రీరామ్ ప్రసాద్



నగరం, న్యూస్‌టుడే: నగరం ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ సీఐగా శ్రీరామ్ ప్రసాద్ మంగళవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ సాధారణ బదిలీల్లో భాగంగా నరసరావుపేట నుంచి వచ్చినట్లు తెలిపారు. ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త మద్యం విధానాన్ని అమలు చేసేందుకు శక్తివంచన లేకుండా పనిచేస్తానన్నారు. సారా, మద్యం అక్రమ విక్రయాలు నిర్వహించరాదని హెచ్చరించారు. ప్రభుత్వ నిబంధనలను అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

విద్యార్థులకు కళ్లజోళ్ల పంపిణీ

మోపర్రు (అమృతలూరు): మోపర్రు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మంగళవారం కళ్లజోళ్లు పంపిణీ చేశారు. సెప్టెంబరు 19న పాఠశాలలో నిర్వహించిన ఉచిత కంటి పరీక్షల వైద్యశిబిరంలో 26మంది విద్యార్థులకు కళ్లద్దాలు అవసరం ఉన్నట్లు గుర్తించారు. వీరికి అమృతలూరుకు చెందిన ప్రవాస భారతీయుడు మైనేని శ్రీహర్ష సహకారంతో అందజేశారు. కార్యక్రమంలో మైనేని రత్నప్రసాద్, గోగినేని వరప్రసాద్, కొండపల్లి వెంకటేశ్వరరావు, సరళ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు. ప్రధానోపాధ్యాయుడు నాంచారయ్య దాతకు కృతజ్ఞతలు తెలిపారు.

కుట్టుమిషన్ అందజేత

బాపట్ల పట్టణం: స్థానిక విజయలక్ష్మిపురంలోని యస్‌టునీడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కుట్టు శిక్షణ పొందుతున్న మహిళల సౌకర్యార్థం కుట్టు మిషన్‌ను మంగళవారం అందచేశారు. గ్రామీణ మహిళల కుటుంబాల్లో సుస్థిరమైన ఆర్థిక పరిస్థితిని పెంపొందించేందుకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు శిక్షకురాలు కుందేటి శివకుమారి తెలిపారు. సామాజిక బాధ్యతతో మహిళలు అన్ని రంగాల్లో రాణించాలనే ఉద్దేశ్యంతో సేవా, శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఫౌండేషన్ డైరెక్టర్ తోట సురేష్‌బాబు చెప్పారు.

మద్యం అక్రమ విక్రేత అరెస్ట్

బాపట్ల పట్టణం, న్యూస్‌టుడే : మండల పరిధి స్టూవర్టుపురం గ్రామ సమీపంలోని స్టోర్‌గ్యాంగ్ వద్ద జాతీయ రహదారి వెంబడి శీతలపానీయాల దుకాణంలో అక్రమంగా నిల్వ ఉంచిన 17 బీరు సీసాలను మంగళవారం రాత్రి స్వాధీనం చేసుకున్నట్లు వెదుళ్లపల్లి ఎస్సై పి.జనార్ధనరావు తెలిపారు. మద్యాన్ని విక్రయిస్తున్న భోగిరి శివాజీని అరెస్ట్ చేసి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.



పూజల్లో జనసేన నాయకులు

వేంకటేశ్వరుడికి అఖండ దీపారాధన

బాపట్ల పట్టణం: తిరుమల శ్రీవారి లడ్డూ కల్తీతో జరిగిన అపరాధానికి ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పిలుపు మేరకు జనసేన నాయకులు మండల పరిధిలోని కొండుభట్లవారిపాలెంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో స్వామివారికి అఖండ దీపారాధన చేపట్టారు. స్వామికి ప్రత్యేక పూజలు, అర్చనలు అభిషేకాలు చేశారు. సనాతన ధర్మ పరిరక్షణ కోసం ప్రాయశ్చిత్త దీక్షను పట్టిపట్టేలా తీసుకెళ్తున్నట్లు జనసేన సమన్వయకర్త నామన వెంకటకృష్ణ నారాయణ తెలిపారు. పెద్ద ఎత్తున మహిళలు పాల్గొని స్వామివారి దేవాలయంలో దీపారాధన చేస్తూ శ్రీవారి లడ్డూ కల్తీకి సంబంధించిన అపరాధం మన్నించాలని వేడుకున్నారు. నాయకులు నాగమల్లేశ్వరరావు, విష్ణుమొలకల చంద్రమోహన్, పి.దుర్గారావు, సత్యనారాయణ, రత్నకుమార్, గ్రామస్థులు, వీరమహిళలు పాల్గొన్నారు.

జూద స్థావరంపై పోలీసుల దాడులు

బాపట్ల పట్టణం, న్యూస్‌టుడే : మండల పరిధి స్టూవర్టుపురం గ్రామంలో జూద స్థావరంపై మంగళవారం రాత్రి వెదుళ్లపల్లి పోలీసులు దాడులు చేశారు. గ్రామంలోని ఒకటో గ్యాంగ్‌లో జనావాసాల మధ్య పేకాడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.3,800 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై పి.జనార్ధనరావు తెలిపారు.

జిల్లాలో 150 పడకలతో వృద్ధాశ్రమం ఏర్పాటుకు వినతి

బాపట్ల, న్యూస్‌టుడే: ప్రతి జిల్లాలో 150 పడకలతో వృద్ధాశ్రమాన్ని ఏర్పాటు చేయాలని రంగస్థల నటుడు, ఎన్టీఆర్ అవార్డు గ్రహీత కేఎస్‌టీ శాయి అన్నారు. పట్టణంలోని ఎన్జీవో హోమ్‌లో ప్రపంచ వృద్ధుల దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వృద్ధుల కోసం డేకేర్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని, బస్సులు, రైళ్ల ఛార్జీల్లో రాయితీ ఇవ్వాలని కోరారు. వయోవృద్ధుల సంక్షేమ సంఘం కార్యాలయ భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని పురపాలక కమిషనర్ నిర్మల్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కమిషనర్ మాట్లాడుతూ వయోవృద్ధుల సంక్షేమానికి కృషి చేస్తానన్నారు. విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు జీవీ బ్రహ్మం, ఇతర నేతలను సత్కరించారు. నేతలు శ్రీహరిరావు, నరేష్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, శాంతారామ్, సిద్ధయ్య, బందా బాబు తదితరులు పాల్గొన్నారు.



విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు జీవీ బ్రహ్మంను సత్కరిస్తున్న పురపాలక కమిషనర్ నిర్మల్‌కుమార్

ఉచిత ఇసుకను అందుబాటులోకి తేవాలి

రేపల్లె అర్బన్, న్యూస్‌టుడే: ఉచిత ఇసుకను ప్రభుత్వం వెంటనే అందుబాటులోకి తేవాలని ఏసీటీయూసీ రాష్ట్ర నాయకుడు పి.నాగాంజనేయులు డిమాండ్ చేశారు. ఉచిత ఇసుక పథకాన్ని అమలు చేయాలని కోరుతూ రేపల్లె ఏరియా భవన నిర్మాణ కార్మిక సంఘం, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో స్థానిక ఆర్టీసీ బస్టాండ్ నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన ఉచిత ఇసుక హామీ పథకం అమలుకు నోచుకోకపోవడంతో రాష్ట్రంలో లక్షలాది మంది భవన నిర్మాణ కార్మికులు ఉపాధి కోల్పోయారన్నారు. ఉచిత ఇసుక ఆన్‌లైన్ విధానంలో అవకతవకలు జరుగుతున్నాయని భవన నిర్మాణ యజమానులు, కార్మికులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. గత ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డులో ఉన్న అనేక పథకాలకు మంగళం పాడిందని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి పథకాలకు చట్టభద్రత కల్పించాలని కోరారు. కార్యాలయం ఎదుట నినాదాలు చేసి సీనియర్ అసిస్టెంట్ నాగయ్యకు వినతిపత్రం అందించారు. కార్మిక సంఘం ఏరియా అధ్యక్షుడు శ్రీమన్నారాయణ, శ్రీనివాసరావు, బాబూ నాంచారయ్య, కాళిదాసు, పూర్ణచంద్రరావు, కోటేశ్వరరావు, మధు తదితరులు పాల్గొన్నారు.



ఇసుక నిర్మాణ కార్మికుల ప్రదర్శన

నిర్వాసితులకు 'స్వచ్ఛంద' అండ

కొల్లూరు, న్యూస్‌టుడే: వరదల వల్ల నివాసాలు కోల్పోయి కరకట్ట సమీపంలో ఓ చెట్టు కింద నివాసం ఉంటున్న పక్షవాతానికి గురైన ఒంటరి వృద్ధురాలితో సహా నిర్వాసితులైన మూడు కుటుంబాలకు ప్రభుత్వం ప్రకటించిన బియ్యం, నిత్యావసరాలను వీఆర్వో జగదీష్ వారి వద్దకు వెళ్లి బుధవారం అందజేశారు. బాధితులకు బాపట్లకు చెందిన అక్షయ హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ నిర్వాహకులు బియ్యం, నిత్యావసరాలు, కూరగాయలు, దుస్తులను నేరుగా అందజేశారు. ఇదే సమయంలో అక్కడ చెట్టు కింద చాపపై పక్షవాతంతో పడి ఉన్న వృద్ధురాలు నాగమ్మను చూసి చలించిపోయారు. వెంటనే స్థానికంగా ఉన్న ఓ ప్రైవేటు వైద్యుడిని తీసుకొచ్చారు. ఆమెను వైద్యశాలలో చేర్పించి తగిన వైద్యం చేయాల్సి ఉందని వైద్యుడు చెప్పడంతో అందుకు అవసరమైన ఏర్పాట్లు చేసేందుకు ప్రయత్నిస్తామని చెప్పిన వారు తాత్కాలికంగా వైద్యుడు సూచించిన మందులు, ప్రత్యేక ఆహార పదార్థాలు తెప్పించి ఇచ్చారు. ఈ అభాగ్యులపై 'ఈనాడు-ఈటీవీ' కథనాలు తమను కదిలించాయని సంస్థ వ్యవస్థాపకుడు కామిశెట్టి సాయిబాబు తెలిపారు. ఇదే సమయంలో అక్కడకు చేరుకున్న స్థానిక తెదేపా నాయకులు గోగినేని వెంకటేష్, వెలివల శ్రీరాములు వృద్ధురాలికి అవసరమైన ఆహారం సమకూర్చేందుకు నగదు సహాయం అందించారు. బాధిత కుటుంబాలకు పూరిళ్ల స్థానంలో రేకులతో అక్కడే నివాసాలు ఏర్పాటు చేస్తామని వారు హామీ ఇచ్చారు.



వృద్ధురాలికి మందులు అందిస్తున్న స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు

సచివాలయ ఉద్యోగికి పీహెచ్‌డీ

బాపట్ల పట్టణం, న్యూస్‌టుడే: ముత్తాయపాలెం సచివాలయ ఉద్యోగి సీహెచ్ శ్యామ్‌కుమార్ పీహెచ్‌డీ పట్టా అందుకున్నారు. యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ నుంచి ఆంత్రోపాలజీ సబ్జెక్టులో ఆయనకు పీహెచ్‌డీ దక్కింది. హైదరాబాద్‌లో తెలంగాణ గవర్నర్ చేతులమీదుగా మంగళవారం పట్టా అందుకున్నారు. ఆయనకు ఏడీఏ లక్ష్మి, ఏవో చంద్రశేఖర్ అభినందనలు తెలిపారు.

మహిళపై కోతి దాడి

బాపట్ల: పట్టణంలోని విజయలక్ష్మీపురంలో కోతుల బెడద ఎక్కువగా ఉంది. కూరగాయలు విక్రయిస్తున్న లక్ష్మీ అనే మహిళపై కోతి దాడి చేసి గాయపరిచిన ఘటన మంగళవారం జరిగింది. క్షతగాత్రురాలిని చికిత్స నిమిత్తం స్థానిక ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు.

అర్హులైన దివ్యాంగులకు రూ.15వేల పింఛను

బాపట్ల, బాపట్ల పట్టణం, పిట్టలవానిపాలెం, కర్లపాలెం, చెరుకుపల్లి, నిజాంపట్నం, న్యూస్‌టుడే: అర్హులైన దివ్యాంగులకు ఎన్టీఆర్ భరోసా కింద ప్రభుత్వం ప్రతి నెలా రూ.15 వేల పింఛను అందిస్తుందని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ అన్నారు. 80 శాతం వైకల్యం కలిగిన దివ్యాంగులకు వైద్య ధ్రువీకరణ పత్రాలను స్థానిక ప్రాంతీయ ఆసుపత్రిలో ఆయన మంగళవారం అందజేశారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ సిద్ధార్థ, జనసేన సమన్వయకర్త శివనారాయణ, తెదేపా పరిశీలకుడు సాంబిరెడ్డి, పట్టణాధ్యక్షుడు గొలపల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. తెల్లవారుజాము నుంచే ఇంటింటి పంపిణీ.. బాపట్ల, రేపల్లె, వేమూరు నియోజకవర్గాల్లోని మండలాల్లో అన్ని గ్రామాల్లో మంగళవారం ఉదయం అయిదు గంటల నుంచే అధికారులు, తెదేపా నాయకులు లబ్ధిదారుల ఇంటికి వెళ్లి పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కర్లపాలెం మండలం దమ్మనవారిపాలెంలో ఎమ్మెల్యే వేగేశన పంపిణీ చేశారు. పిట్టలవానిపాలెంలో మండల తెలుగు మహిళ అధ్యక్షురాలు గ్లోరియానెట్, ఆయా గ్రామ కమిటీ అధ్యక్షులు అందజేశారు. చెరుకుపల్లి మండలంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమం రికార్డు స్థాయిలో జరిగినట్లు ఈవోపీఆర్డీ పి.సునీత తెలిపారు. అత్యధికంగా కుంచలవారిపాలెం గ్రామంలో 98.77శాతం పంపిణీ జరిగిందని తెలిపారు. నిజాంపట్నం, బావాజీపాలెంలో తెదేపా నాయకులు పింఛన్లు అందించారు. బాపట్ల మండలం అప్పికట్లలో క్లస్టర్ ఇన్‌ఛార్జి ఇనగంటి గాంధీ పింఛన్లు పంపిణీ చేశారు.



కర్లపాలెం: పింఛన్ల పంపిణీలో ఎమ్మెల్యే నరేంద్రవర్మ

వరిపైరులో పచ్చపురుగు బెడద

అమృతలూరు, రేపల్లె అర్బన్, వేమూరు, చెరుకుపల్లి, న్యూస్‌టుడే: వరిపైరులో పచ్చ పురుగు కనిపిస్తోందని బాపట్ల జిల్లా డీడీఏ విజయనిర్మల అన్నారు. అమృతలూరు మండలం కూచిపూడి, యడవూరు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈసందర్భంగా క్షేత్రస్థాయిలో వరిపైరును పరిశీలించారు. రైతులతో మాట్లాడుతూ పచ్చ పురుగు నివారణకు క్లోరోత్రానిప్రోల్ 0.3మి.లీ మందును 4లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలని ఆమె సూచించారు. అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న నేపథ్యంలో ఎర్రనల్లి వచ్చే అవకాశం ఉందని నివారణ కోసం వెట్టబుల్ సల్ఫర్ 600గ్రా మందును నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. బ్లాక్, రెడ్ రైస్ ఆహారంగా తీసుకుంటే క్యాన్సరు, మధుమేహం, గుండె సంబంధిత సమస్యలను ఎదుర్కొనే వ్యాధి నిరోధకశక్తి వృద్ధి చెందుతుందని బాపట్ల వరి పరిశోధన కేంద్ర జన్యు విభాగం అధికారి డాక్టర్ హరిత పేర్కొన్నారు. రేపల్లె మండలం బేతపూడిలో మాట్లాడుతూ వాటిలో ఇనుము, పీచు పదార్థాలు అధిక మోతాదులో ఉంటాయని తెలిపారు. వేమూరు మండలం చదలవాడలో మండల వ్యవసాయాధికారిణి సునీత మాట్లాడుతూ వరిలో పొటాష్ ఎరువును సరైన దఫాలలో వాడడం లేదని, దీని వల్ల నాణ్యమైన, అధిక దిగుబడులు రావడం లేదని చెప్పారు. చెరుకుపల్లిలో ఏవో టి.బాలాజీ గంగాధర్ మాట్లాడుతూ ఇటీవల వరదల కారణంగా ముంపు బారిన పడి కోలుకొన్న పొలాల్లో ఎకరానికి 15 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్, 20 కిలోల యూరియా కలిపి చల్లితే పైరు త్వరగా కోలుకొనే అవకాశం ఉంటుందన్నారు.



కూచిపూడిలో రైతులతో మాట్లాడుతున్న డీడీఏ విజయనిర్మల, తదితరులు

ఆంధ్ర రాష్ట్ర అవతరణలో బాపట్ల పాత్ర కీలకం

బాపట్ల, న్యూస్‌టుడే: ఆంధ్ర రాష్ట్ర అవతరణలో బాపట్ల కీలక పాత్ర పోషించిందని అదనపు ఎస్పీ విఠలేశ్వర్ అన్నారు. ఫోరం ఫర్ బెటర్ బాపట్ల ఆధ్వర్యంలో ఆంధ్ర రాష్ట్ర అవతరణ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రథమాంధ్ర మహాసభలు జరిగిన చారిత్రక టౌన్‌హాలులో తెలుగు తల్లి విగ్రహానికి అదనపు ఎస్పీ పూలమాల వేశారు. ఆయన మాట్లాడుతూ బాపట్ల కవులు తెలుగు ప్రజలను తమ రచనలు, కవితలతో జాగృతం చేశారన్నారు. ఈ ప్రాంతానికి చెందిన స్వాతంత్ర సమరయోధుడు స్వామి సీతారాం ఆంధ్ర రాష్ట్రం కోసం 1951 ఆగస్టు 15న ఆమరణ దీక్ష ప్రారంభించారని గుర్తుచేశారు. సర్వోదయ నేత వినోభాభావే జోక్యంతో దీక్ష విరమించారని తెలిపారు. ఫోరం కార్యదర్శి పీసీ సాయిబాబు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ఏవీ రమణారావు, పౌరసమాఖ్య నేతలు కె.విజయ్‌కుమార్, కలాం, యూవీ రామారావు, రమణకుమార్, సీహెచ్ భవానీదేవి తదితరులు పాల్గొన్నారు.



తెలుగుతల్లి విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న అదనపు ఎస్పీ విఠలేశ్వర్, ఫోరం కార్యదర్శి సాయిబాబు

విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలి

గుళ్లపల్లి (చెరుకుపల్లి (గ్రామీణ), నగరం, నిజాంపట్నం, న్యూస్‌టుడే: విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలని గుళ్లపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం పాలడుగు కవిత ఆకాంక్షించారు. జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో పాఠశాలలో మంగళవారం నిర్వహించిన చెకుముకి మండల స్థాయి పోటీలను ఆమె ప్రారంభించారు. మొత్తం 16 పాఠశాలల నుంచి జట్లు పాల్గొన్నాయి. వీటిలో గుళ్లపల్లి, చెరుకుపల్లి జడ్పీఉన్నత పాఠశాల, గూడవల్లి వనజాచంద్ర పబ్లిక్ పాఠశాల, పొన్నపల్లి హోలియర్ వరల్డ్ స్కూల్ జట్లు విజేతలుగా నిలిచారన్నారు. వీరు ఈనెల 27న బాపట్లలో జరిగే జిల్లా స్థాయి పోటీలకు పాల్గొంటారని తెలిపారు. విజేతలకు ఎన్‌ఆర్‌ఐ ఫౌండేషన్ సౌజన్యంతో బహుమతులను అందించారు. నిజాంపట్నం జడ్పీ ఉన్నత పాఠశాలలో చెకుముకి సైన్సు పోటీల విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. యూటీఎఫ్ జిల్లా ప్రతినిధులు పాల్గొన్నారు. నగరం మండల పరిధిలోని ఉల్లిపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం మండల స్థాయి చెకుముకి పోటీలు నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల విభాగంలో స్థానిక పాఠశాల విద్యార్థులు కె.మోనిక, కె. ఐశ్వర్య, ఎ. లోకేష్‌లు, ప్రైవేటు పాఠశాలల విభాగంలో నగరం ఆక్స్‌ఫర్డ్ ఉన్నత పాఠశాల విద్యార్థులు పి.గీతక్, ఎ. అనూష, షేక్ అమాన్ అలీలు మండల స్థాయిలో తొలి మూడు స్థానాలు దక్కించుకున్నారు.

భాషపై పట్టు అవసరం

గూడవల్లి (చెరుకుపల్లి (గ్రామీణ), న్యూస్‌టుడే: భాషపై పట్టు సాధిస్తే ఉన్నత స్థితికి చేరగలమని గూడవల్లి వనజాచంద్ర పాఠశాల డైరెక్టర్ కొడాలి జ్యోత్స్న అన్నారు. మంగళవారం పాఠశాలలో నిర్వహించి ఆంగ్ల ఫెస్ట్‌ను ఆమె పర్యవేక్షించారు. పాఠశాల విద్యార్థులు ఆంగ్ల వ్యాకరణం, సాహిత్యంతో ఏర్పాటు చేసిన ప్రదర్శనకు మంచి స్పందన వచ్చింది. కార్యక్రమంలో ప్రిన్సిపల్ శ్వేత, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడలతో సృజన

చుండూరు, నగరం, భట్టిప్రోలు, గుళ్లపల్లి (చెరుకుపల్లి (గ్రామీణ), న్యూస్‌టుడే: క్రీడలతో విద్యార్థుల్లో సృజన పెంపొందుతుందని వక్తలు తెలిపారు. గుంటూరు జిల్లా పెనుమాక జూనియర్ కళాశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో బాలికల అండర్-17 జిల్లా స్థాయి అథ్లెటిక్స్ నిర్వహించారు. ఈ పోటీల్లో చుండూరు మండలం యడ్లపల్లి ఉన్నత పాఠశాలకు చెంది మేఘన 1500మీటర్ల పరుగు, మోనాలిక మూడు కి.మీ పరుగు, జి.దీపిక 400 మీటర్ల హర్డిల్స్‌లో ప్రథమ స్థానం సాధించారు. నగరం ఆక్స్‌ఫర్డ్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎం.అశ్విన్, పి.సాహితి, యు.పూర్ణసింధు, వై.హర్షితలు డివిజన్ స్థాయి పోటీల్లో ప్రతిభ చూపి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వేమూరు నియోజకవర్గ స్థాయిలో అండర్-14, 17 విభాగాల్లో కబడ్డీ, ఖోఖో, అథ్లెటిక్స్‌లో పెసర్లంక జడ్పీ విద్యార్థినులు జిల్లా జట్టుకు ఎంపికయ్యారు. మండలంలోని సూరేపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థిని జిల్లాస్థాయిలో జరిగిన 'సేవ్ ద గర్ల్ చైల్డ్' అనే అంశంపై జరిగిన వక్తృత్వ పోటీల్లో ద్వితీయస్థానం సాధించినట్లు ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసశర్మ తెలిపారు. చెరుకుపల్లి మండలం గుళ్లపల్లి జడ్పీఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ఇటీవల నిర్వహించిన మండల, జిల్లా స్థాయి పోటీల్లో విజయం సాధించారు. అథ్లెటిక్స్‌లో డి.రాకేష్, ఎస్‌కే.పీర్‌బాజి, అండర్-17 కబడ్డీలో డి.కృష్ణారెడ్డి, ఎస్.అపర్ణ, సీహెచ్.దేవి, ఖోఖోలో పి.భాగ్యలక్ష్మి, ఎస్‌కే షాహీన, అండర్-14 కబడ్డీలో మోహిన్‌ఖాన్, ఆర్.హన్సిక జిల్లా జట్లకు ఎంపికయ్యారని హెచ్‌ఎం పి.కవిత తెలిపారు.

భారతీయులం.. ఏకత చాటుదాం

గుళ్లపల్లి (చెరుకుపల్లి (గ్రామీణ), న్యూస్‌టుడే: గాంధీ జయంతి సందర్భంగా మండలంలోని గుళ్లపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు 'మనమంతా భారతీయులం' అంటూ మంగళవారం నినదించారు. బాపూజీని స్మరిస్తూ అంతా సమానమే అని.. భారతీయులంతా ఒక్కటే అంటూ మానవహారంగా ఏర్పడ్డారు. వివక్షకు తావు లేని నవ సమాజాన్ని నేటి విద్యార్థులు భవిష్యత్తులో నిర్మించాలని హెచ్‌ఎం కవిత సూచించారు. ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొని విద్యార్థులతో పాటు మానవహారంలో భాగస్వాములయ్యారు.



విద్యార్థుల మానవహారం

పరిసరాల పరిశుభ్రత సమష్టి బాధ్యత

బాపట్ల, బాపట్ల పట్టణం, రేపల్లె అర్బన్, అమృతలూరు, నగరం, న్యూస్‌టుడే: స్వచ్ఛ తీరం కార్యక్రమంతో సాగర కాలుష్యాన్ని నివారించవచ్చని బాపట్ల ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ టీఈ గోపాలకృష్ణమూర్తి అన్నారు. ఫార్మసీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విభాగం ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవలో భాగంగా విద్యార్థులు సూర్యలంక బీచ్‌లో శ్రమదానం చేసి తీరంలో వ్యర్థాలు తొలగించారు. ఎన్టీఆర్ ఆహార విజ్ఞాన సాంకేతిక కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఏడీ ఎంఎస్ బేగ్ మాట్లాడుతూ ప్రతి వీధిలో మొక్కలు నాటి హరితమయం చేయాలన్నారు. ఎన్టీఆర్ ఏజీ ఇంజినీరింగ్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులు జాతీయ రహదారి వెంబడి శ్రమదానం చేసి పిచ్చిమొక్కలు తొలగించారు. సూర్యలంక తీరంలోని మెరైన్ పోలీస్‌స్టేషన్‌లో పరిసరాల పరిశుభ్రత కార్యక్రమాన్ని మంగళవారం చేపట్టారు. సీఐ లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో కొబ్బరి, జామ, నేరేడు మొక్కలను నాటారు. మండల కేంద్రం నగరం రోడ్లను శ్రీ వెలగపూడి రామకృష్ణ డిగ్రీ కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు శుభ్రం చేశారు. అమృతలూరు మండలం గోవాడ జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు గ్రామంలో మావనహారం ఏర్పాటుచేశారు. రేపల్లె పాత పట్టణం మున్సిపల్ ఉన్నత పాఠశాలలో 8, 9, 10 తరగతుల విద్యార్థులకు పరిసరాల పరిశుభ్రతపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన వారితో పాటు పోటీలో పాల్గొన్న వారికి బహుమతులు అందజేశారు.



సూర్యలంక బీచ్‌లో వ్యర్థాలు తొలగిస్తున్న ఫార్మసీ విద్యార్థులు

చీరాల

• చీరాల • అద్దంకి • పర్చూరు

దసరా పూజలకు మంత్రికి ఆహ్వానం

అద్దంకి, న్యూస్‌టుడే: పట్టణంలోని శ్రీ చక్ర సహిత వాసవీ కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో నిర్వహించే దసరా నవరాత్రులకు హాజరు కావాలని మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ను ఆలయ పాలకవర్గ సభ్యులు మంగళవారం కలిసి ఆహ్వానించారు. సభ్యులు ఓటుకూరి రామ కోటేశ్వరరావు, చిన్ని లక్ష్మీ శ్రీనివాసరావు, ఆరవపల్లి హనుమంతరావు, నేరెళ్ల శ్రీనివాసరావు ఉన్నారు.

3 నుంచి నవరాత్రి ఉత్సవాలు

మార్టూరు, న్యూస్‌టుడే: మార్టూరు మండలం ద్రోణాదులలోని శ్రీ అంకాల పరమేశ్వరి దేవస్థానంలో ఈ నెల 3 నుంచి దసరా శరన్నవరాత్రి ఉత్సవాలను ప్రధాన పూజారి అళహరి పూర్ణచంద్రరావు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు దేవాలయ కమిటీ ఛైర్మన్ గౌరీశంకర్ మంగళవారం తెలిపారు.

రాతి ముఖమండపం నిర్మాణానికి విరాళం



విరాళం చెక్కు అందిస్తున్న దాత మోదడుగు వెంకటేశ్వరరావు దంపతులు

శింగరకొండ (అద్దంకి), న్యూస్‌టుడే: శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి ఆలయ రాతి ముఖమండపం నిర్మాణానికి దాత మోదడుగు వెంకటేశ్వరరావు దంపతులు రూ.1,00,116 విరాళం అందించారు. మంగళవారం గుడికి వచ్చిన దంపతులు తొలుత స్వామివారి దర్శనం అనంతరం విరాళం చెక్కును సహాయ కమిషనర్ ఎం.తిమ్మానాయుడుకు అందించారు. తగు రసీదును దాతకు అందజేశారు.

పావులూరు మైనరు.. పొలాలకు చేరని నీరు

ఇంకొల్లు, న్యూస్‌టుడే: సాగరు ఆయకట్టులోని పావులూరు మైనరు నిర్వహణ లోపాలతో సాగు నీరు సవ్యంగా పొలాలకు అందే పరిస్థితి కనిపించడంలేదు. దశాబ్దకాలంగా ఆయకట్టులో మాగాణి సాగు నిలిచిపోయింది. సాగరు కాలువ దిగువన పావులూరు మైనరు ఉన్నందున ఎగువ నుంచి తక్కువ మొత్తంలో నీరు దిగువకు వస్తున్నందున మాగాణి సాగు పూర్తిగా ఆగిపోయింది. దీని పరిధిలో పదివేల ఎకరాల ఆయకట్టు ఉండగా ఐదువేల ఎకరాల్లో ఆరుతడి పంటలు వేస్తున్నారు. మిరప, మొక్కజొన్నలాంటి పంటలకూ సరిపడా నీరు అందటంలేదు. కాలువల నిర్వహణకు లస్కర్ల వ్యవస్థ లేనందున కాలువ అంచున తుమ్మచెట్లు, నాచు, జమ్ము, తూటికాడ పెరిగి ప్రవాహానికి ఆటంకం కలుగుతోంది. గ్రామాల్లోని వ్యర్థాలు సాగరు కాలువల్లో వేస్తున్నందున సైఫన్ల దగ్గర అడ్డుపడి, ఎగువన కట్టలు తెగి రోజుల పాటు నీరు నిలిచిపోవటంతో రైతులు నష్టపోతున్నారు. పర్చూరు రోడ్డు నుంచి పావులూరు డొంక సైఫన్ వరకు ఉత్తరం వైపు రాకపోకలకు వినియోగించే రహదారి ఇరువైపులా చిల్లచెట్లు పెరిగి, ద్విచక్ర వాహనాలు తిరగని పరిస్థితి నెలకొంది. ఈ ఏడాది కాలువకు సమృద్ధిగా నీరు విడుదల చేస్తున్నామని అధికారులు ప్రకటించారు. కాలువ మరమ్మతులతో పాటు రహదారి బాగు చేయాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు. ఈవిషయమై ఏఈ బాలకృష్ణ వివరిస్తూ ఆయకట్టుకు సరిపడా లస్కర్ల నియామకం జరగలేదన్నారు. కాలువను పరిశీలించి చిల్లచెట్లు తొలగించి అవసరమైన చోట రహదారికి మరమ్మతులు చేపట్టేందుకు కృషి చేస్తామని చెప్పారు.



చిల్లచెట్లతో మూసుకుపోయిన కాలువ కట్ట మార్గం



గుంతల రహదారికి మోక్షం ఎప్పుడో?

చిత్రంలో కనిపిస్తున్నది దేశాయిపేట పంచాయతీ సిలోన్ కాలనీకి వెళ్లే రోడ్డు. దీంతో పాటు ఎఫ్‌సీఐ గోదాములకు బియ్యం, ఇతర సరకులు రవాణా చేసే లారీలు దీనిపై ప్రయాణించాల్సిందే. ఐటీఐ కాలనీ ప్రజలు రాకపోకలు సాగిస్తారు. ఇంతటి ప్రాధాన్యం కలిగిన రహదారికి గుంతలు ఏర్పడ్డాయి. దాదాపు ఏడాదిగా ఇదే పరిస్థితి నెలకొంది. దీంతో వాహనాలు వెళ్లడం ఇబ్బందిగా మారిందని చోదకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనికితోడు ఇటీవల కురిసిన వర్షాలకు ఆ గుంతల్లో నీరు నిలవడంతో ద్విచక్ర వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు చర్యలు చేపట్టాలని చోదకులతో పాటు ఆయా కాలనీ ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. – న్యూస్‌టుడే, చీరాల అర్బన్

మద్యం రహిత గ్రామం.. గోపాలపురం

గోపాలపురం(అద్దంకి), న్యూస్‌టుడే: శింగరకొండ క్షేత్రానికి అత్యంత సమీపంలో ఉండే గోపాలపురంలో పుష్కర కాలం నుంచి మద్యం అమ్మకాలు నిలిచాయి. మద్యం తాగే అలవాటున్న వారెవరైనా ఉంటే ఊరు బయటే తాగి రావాలి. గ్రామంలో అమ్మకాలు జరిగినట్లు గుర్తిస్తే మహిళాగ్రహానికి గురికాక తప్పదు. 2010లో మహిళలు చేపట్టిన సారా వ్యతిరేక ఉద్యమానికి లోక్‌సత్తా నాయకులు జయప్రకాష్‌నారాయణ్ అండగా నిలిచారు. తదనుగుణంగా నేటికీ మద్యం విక్రయాలు, గొలుసు దుకాణాలు ఏర్పాటు చేయాలంటే గతంలో చేసుకున్న కట్టుబాటు అడ్డుగా వస్తుందని గ్రామస్థులు చెబుతున్నారు. గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం ఇలాంటి చోటనే సాకారమవుతుంది.

మద్యానికి బానిసలైన యువకుడి మృతితో ఉద్యమం.. గోపాలపురంలో సగానికి పైగా ఎస్సీ, ఎస్టీలు నివసిస్తున్నారు. భవనాశి తటాకంలో చేపల వేటతోనే వీరికి జీవనం. 2010కి పూర్వం చేపల వేట ద్వారా వచ్చిన ఆదాయం మొత్తం చెరువు ఒడ్డున గల గొలుసు దుకాణంలో మద్యం తాగుడుకు ఖర్చు చేస్తుండేవారు. దీన్ని ఆసరాగా చేసుకుని కుటుంబాల్లో గొడవలు పెరిగాయి. ఈ క్రమంలో ఓ యువకుడు తీవ్రంగా మద్యం తాగి గొంతు ఎండిపోయి చనిపోయాడు. ఆ దృశ్యాన్ని తట్టుకోలేక భార్య తనువు చాలించింది. దీంతో మహిళల్లో ఆగ్రహం కట్టలు తెంచుకుంది. గొలుసు దుకాణాలను ధ్వంసం చేశారు. అద్దంకి ఎక్సైజ్ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమం నెల రోజుల పాటు నిరాటంకంగా సాగింది. నాడు ఏర్పడిన కట్టుబాటు ఫలితంగా నేటికీ గ్రామంలో మద్యం గొలుసు దుకాణాలు నియంత్రించగలిగారు. మిగిలిన గ్రామాలకు ఆదర్శంగా నిలిచారు.



వయోవృద్ధులకు ప్రత్యేక చట్టాలు

పర్చూరు (మార్టూరు), న్యూస్‌టుడే: వయోవృద్ధుల కోసం ప్రత్యేక చట్టాలు అమలు చేస్తున్నట్లు సీనియర్ సివిల్‌జడ్జి పి.ప్రశాంతి తెలిపారు. ప్రపంచ వయో వృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని పర్చూరులో మంగళవారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షురాలు శ్రీరమణి, ఎం.రవీంద్రారెడ్డి, కె.సులేమాన్, కె.ధనలక్ష్మి, రుక్మిణి, జాన్‌బాబు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

చినగంజాం, న్యూస్‌టుడే: ప్రపంచ వృద్ధుల దినోత్సవాన్ని స్థానిక చండీబజార్‌లోని వాల్మీకి వృద్ధుల ఆశ్రమంలో నిర్వహించారు. దివ్యాంగుడు, భారత నిర్మాణ వాలంటీర్ గోవిందస్వామి ఆధ్వర్యంలో వృద్ధులకు చెస్, క్యారమ్స్, మ్యూజికల్ ఛైర్స్ తదితర పోటీలు చేపట్టారు. విజేతలకు బహుమతులు అందజేశారు. జి.సోమయ్య పాల్గొన్నారు.

వేటపాలెం, న్యూస్‌టుడే: ప్రపంచ వృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని నీలకంఠపురంలోని అనాథ వృద్ధశరణాలయంలో మంగళవారం మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో సదస్సు ఏర్పాటు చేశారు. సిటిజన్ యాక్ట్, వివిధ చట్టాల గురించి న్యాయవాదులు రామకృష్ణారెడ్డి, మహిళా ప్రతినిధి జీకే ఈశ్వర్‌రెడ్డి వివరించారు. డాక్టరు సత్రం మల్లేశ్వరరావు, గుత్తి విశ్వేశ్వరరావు, ఎస్టీ మతీన్, ఎస్ఎం సుభానీ పాల్గొన్నారు.

రక్తదానంతో ప్రాణదానం

పర్చూరు(మార్టూరు), న్యూస్‌టుడే: ప్రజలు రక్తదానం చేసి ఓ నిండుప్రాణాన్ని కాపాడే అవకాశం ఉందని రోటరీ క్లబ్ అధ్యక్షుడు తోకల కృష్ణమోహన్ తెలిపారు. పర్చూరులో మంగళవారం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. తోకల నాగయ్య, సుబ్బాయమ్మ జ్ఞాపకార్థం మనవడు కొమ్మాలపాటి మనోజ్‌కుమార్, లక్ష్మీసుమ ఆర్థిక సహకారంతో ఇది ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. రాయల శ్రీనివాసరావు, తేళ్ల రమేష్‌చంద్ర, కోమటి ఆంజనేయులు సహకారం అందించారు.

మూడు చక్రాల వాహనం అందజేత

కొప్పరం (సంతమాగులూరు): సంతమాగులూరు మండలం కొప్పరం గ్రామానికి చెందిన షేక్ రసూల్‌కు మూడు చక్రాల వాహనాన్ని విద్యుత్తు శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ మంగళవారం అందించారు. జె.పంగులూరులో జరిగిన కార్యక్రమంలో ఇది అందజేశారు.

ఎన్నికల హామీలన్నీ నెరవేరుస్తాం: మంత్రి గొట్టిపాటి



జేపంగులూరు బీసీ కాలనీలో మాట్లాడుతున్న మంత్రి గొట్టిపాటి

జే పంగులూరు, న్యూస్‌టుడే: కూటమి అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే అనేక సంక్షేమ, అభివృద్ధి పనులకు శ్రీకారం పలికిందని రాష్ట్ర విద్యుత్తు శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. జే పంగులూరు బీసీ కాలనీ వద్ద మంగళవారం పింఛన్ల పంపిణీకి ఆయన హాజరయ్యారు. సభకు తెదేపా మండల అధ్యక్షుడు రావూరి రమేష్‌బాబు అధ్యక్షత వహించారు. ఎన్నికల సమయంలో కాలనీలో పర్యటించినప్పుడు ఇచ్చిన హామీ మేరకు రూ.30 లక్షలతో సిమెంటు రోడ్డు నిర్మించనున్నట్లు ప్రకటించారు. స్థానికుల కోరిక మేరకు సామాజిక భవనం మంజూరు చేయిస్తామన్నారు. గ్రామంలోని పాత విద్యుత్తు స్తంభాల మార్పు, ఆరు నియంత్రికల ఏర్పాటు వంటి చర్యలు జరుగుతున్నట్లు చెప్పారు. ముప్పవరం నుంచి జే పంగులూరు వరకు తెదేపా ప్రభుత్వంలో నిర్మించిన తారురోడ్డుకు తదనంతర ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. ఈకారణంగానే గుంతలు ఏర్పడి ప్రయాణం నరకంగా మారిందన్నారు. తక్షణం గుంతలు పడిన రోడ్లకు మరమ్మతులు చేయిస్తున్నట్లు మంత్రి వివరించారు. మండలంలోని తక్కెళ్లపాడు భూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నట్లు చెప్పారు. ప్రతి సోమవారం చీరాల ఆర్డీవో స్థానిక మండల తహసీల్దార్ కార్యాలయం వద్ద జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక వద్దకు హాజరు కావాలని సూచించామన్నారు. పంచాయతీల్లో పారిశుద్ధ్య కార్మికుల జీతాల చెల్లింపు అంశాన్ని పరిశీలిస్తున్నట్లు వివరించారు.

విద్యుత్తుపై ఆధారపడే వ్యవసాయం పెరిగింది

రాష్ట్రంలో విద్యుత్తుపై ఆధారపడే వ్యవసాయం పెరిగింది. ఈకారణంగానే నాణ్యమైన విద్యుదుత్పత్తి, సరఫరా వంటి అంశాలను పరిశీలించేందుకు ముఖ్యమంత్రితో కలిసి ఇటీవల అహ్మదాబాద్, గాంధీనగర్‌లో పర్యటించానన్నారు. విద్యుత్తు అంతరాయాలు తగ్గించేందుకు అందుబాటులో ఉండే సూర్యకాంతిని ఉపయోగించుకోనున్నట్లు చెప్పారు. విద్యుత్తు ఉపకేంద్రాల సమీపంలో సోలార్ విద్యుత్తు ఉత్పత్తిని ఏర్పాటు చేయబోతున్నామని వెల్లడించారు. ఇంటింటికీ ప్రధానమంత్రి సూర్యఘర్ పథకాన్ని ఏర్పాటు చేయనున్నామన్నారు. దీనికి ఒక వెండర్‌ను ఏర్పాటు చేసి, తద్వారా ఇంటింటికీ సోలార్ విద్యుదుత్పత్తి సాధించనున్నట్లు చెప్పారు. ఎంపీడీవో కార్యాలయం వద్ద చందలూరు గ్రామానికి చెందిన పల్లపోతు శ్యాంసుందర్ రూ.10వేల చెక్కును వరద బాధితుల సహాయార్థం మంత్రికి అందించారు. అనంతరం గ్రామాల వారీగా సమీక్షలు నిర్వహించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు కేజీబీవీ క్రీడాకారిణులు

చినగంజాం, న్యూస్‌టుడే: ఉమ్మడి ప్రకాశం జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సింగరాయకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం జిల్లా స్థాయి క్రీడాకారిణుల ఎంపికలు జరిగాయి. దీనిలో చినగంజాం కేజీబీవీకి చెందిన ఏడుగురు క్రీడాకారిణులు అండర్-19 విభాగాల్లో షటిల్ బ్యాడ్మింటన్, టెన్నికాయిట్, కబడ్డీ జట్లకు ఎంపికయ్యారని పీడీ ఎస్.వాణిశ్రీ తెలిపారు. షటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో కేజీబీవీ జట్టు విజేత నిలిచిందన్నారు. రాష్ట్రస్థాయి పోటీలకు కె.అతల్య, కె.శ్రీవల్లి, కె.తనుశ్రీ, వి.శ్రీలక్ష్మి, కె.కౌసల్య, వి.ధరణి, డి.పల్లవి ఎంపికయ్యారని చెప్పారు.

వాలీబాల్ జట్టుకు గాయత్రి

వేటపాలెం: రాష్ట్రస్థాయి వాలీబాల్ జట్టుకు స్థానిక బాలికోన్నత పాఠశాల విద్యార్థిని గాయత్రి అండర్-14 విభాగంలో ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు ఫణి సత్యనారాయణ తెలిపారు. రెండు రోజుల క్రితం ప్రకాశం జిల్లా పేర్నమిట్టలో జరిగిన స్కూల్ గేమ్స్‌లో గాయత్రి ప్రతిభ కనబరిచి అర్హత సాధించిందన్నారు. మంగళవారం బడిలో జరిగిన అభినందన సభలో వ్యాయామోపాధ్యాయులు కోటేశ్వరమ్మ, జరుబుల శ్రావణి, తోటి ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

23 మద్యం దుకాణాలకు టెండర్లు

అద్దంకి, న్యూస్‌టుడే: అద్దంకి ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయం పరిధిలోని ఐదు మండలాల్లో 23 మద్యం దుకాణాల నిర్వహణకు టెండర్లు పిలుస్తున్నట్లు సీఐ ఎ.భవానీ తెలిపారు. మంగళవారం అద్దంకి కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. అద్దంకి పట్టణంలో ఐదు, గ్రామీణంలో రెండు, బల్లికురవలో 4, జే పంగులూరులో 3, కొరిశపాడులో 4, సంతమాగులూరులో 5 దుకాణాలకు అర్జీలు స్వీకరిస్తున్నట్లు ఆమె వెల్లడించారు. ఎస్సైలు ఎస్.హర్షవర్ధన్‌రెడ్డి, జె.వెంకటేశ్వర్లు ఉన్నారు.

నేత్రదానం

నాగండ్ల (ఇంకొల్లు): రోటరీ క్లబ్ఆఫ్ ఇంకొల్లు సెంట్రల్ ఆధ్వర్యంలో 564వ నేత్రదానం జరిగింది. నాగండ్లకు చెందిన జెజ్జం సుబ్బమ్మ(80) మంగళవారం మృతిచెందారు. క్లబ్ సభ్యులు పెదకాకాని శంకర కంటి ఆస్పత్రి సిబ్బందిని రప్పించి, దాత కార్నియాలను సేకరించారు.

బాలికలకు సమయస్ఫూర్తి అవసరం

వేటపాలెం, న్యూస్‌టుడే: ఎంతటి సమస్యనైనా బాలికలు సమయస్ఫూర్తితో ఆలోచించి తదనుగుణంగా ముందుకెళ్లాలని ఎస్సై మీసాల వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. బాలికోన్నత పాఠశాలలో మంగళవారం మహిళా ఉపాధ్యాయులతో కలిసి బాలికలకు బ్యాడ్-గుడ్ టచ్‌లపై వివరించారు. ప్రధానోపాధ్యాయుడు ఫణి సత్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బల్లికురవ (అద్దంకి), న్యూస్‌టుడే: అపరిచిత స్పర్శపై బాలికలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై జీవీ.చౌదరి అన్నారు. బల్లికురవ మండలం చెన్నుపల్లి ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థినులతో మంగళవారం ఆయన మాట్లాడారు.

యద్దనపూడి, న్యూస్‌టుడే: గుడ్‌టచ్-బ్యాడ్ టచ్‌లపై విద్యార్థినులు అవగాహన కలిగిఉండాలని యద్దనపూడి ఎస్సై రత్నకుమారి అన్నారు. యద్దనపూడి జడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థుల భద్రతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు ఎం.దేవేంద్రరావు పాల్గొన్నారు.

దమ్ము చక్రాలతో నడిపితే జరిమానా

సంతమాగులూరు, న్యూస్‌టుడే: రహదారులపై దమ్ము చక్రాలతో నడిపితే జరిమానా విధించనున్నట్లు ఎస్సై ఎం.పట్టాభిరామయ్య వాహన యజమానులను హెచ్చరించారు. మండలంలో దమ్ము ఇనుప చక్రాలు బిగించి ట్రాక్టర్లు నడుపుతున్న వాహన యజమానులకు మంగళవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. రహదారులు పాడవకుండా ఇనుప చక్రాలకు రబ్బరు తొడుగులు బిగించుకోవాలని సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకు జరిమానా విధిస్తామని వారికి తెలిపారు. నిబంధనలు పాటించాలని కోరారు.

విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు

చీరాల, న్యూస్‌టుడే: విద్యార్థి దశ నుంచే దేశభక్తి పెంపొందించుకోవాలని కస్తూర్బా గాంధీ బాలికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు టి.కృష్ణమోహన్ పేర్కొన్నారు. వీర్‌గాథ ప్రాజెక్టులో భాగంగా మంగళవారం 8,9 తరగతుల విద్యార్థులకు స్వాతంత్ర్య సమరయోధుల చిత్రాలు గీయటంలో పోటీలు నిర్వహించారు. విజేతలకు ప్రభాకరరావు బహుమతులు అందజేశారు.

డ్రైవర్ల సంఘం నూతన కమిటీ ఎన్నిక

చీరాల, న్యూస్‌టుడే: పొట్టిశ్రీరాములు ట్యాక్సీ డ్రైవర్స్ యూనియన్ నూతన కమిటీ ఎన్నిక మంగళవారం నిర్వహించారు. అధ్యక్షుడిగా మానుకోట సురేష్‌బాబు, కార్యదర్శిగా జి.సురేష్, సంయుక్త కార్యదర్శిగా చంద్రశేఖర్, కోశాధికారిగా వెంకటేశ్వర్లును ఎన్నుకున్నారు. ఎన్నికల పర్యవేక్షకులుగా ఊబా నాగబాబు, శ్రీధర్, వెంకటరావు, మోజెష్, సాంబశివరావు, గోపికృష్ణ, వ్యవహరించారు. ఈసందర్భంగా సీఐటీయూ పట్టణ కార్యదర్శి ఎం.వసంతరావు మాట్లాడుతూ డ్రైవర్ల సమస్యల పరిష్కారానికి ఐక్యంగా కృషి చేయాలని సూచించారు.



చీరాల: లబ్ధిదారుకు నగదు అందజేస్తున్న తెదేపా నేతలు గంగరాజు, వడగా రాజా



మేదరమెట్లలో పంపిణీ చేస్తున్న ఎంపీడీవో సురేష్‌బాబు



చినగంజాంలో ఎంపీడీవో స్వరూపరాణి ఆధ్వర్యంలో..

చీరాలలో 97 శాతంపైనే పింఛన్ల పంపిణీ

చీరాల అర్బన్, మేదరమెట్ల, చినగంజాం, **న్యూస్‌టుడే:** చీరాల నియోజకవర్గంలో తొలి రోజే 97శాతం పైనే పింఛన్ల పంపిణీని అధికారులు పూర్తి చేశారు. పురపాలక సంఘం పరిధిలో 8214 మందికి 7972, వేటపాలెం మండలంలో 10793కి 10398, చీరాల మండలంలో 11517కి 11121 మందికి పింఛన్లను అందజేశారు. వార్డు, సచివాలయ సిబ్బంది ఉదయం ఆరు గంటల నుంచే పంపిణీ ప్రారంభించారు. వీరితో పాటు కూటమి నేతలు పాల్గొన్నారు.

✦ కొరిశపాడు మండలంలో 95 శాతానికి పైగా పింఛన్ల పంపిణీ పూర్తయినట్లు ఎంపీడీవో సురేష్‌బాబు తెలిపారు.

✦ చినగంజాం మండలంలో 97 శాతం మందికి పింఛన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీవో కె.స్వరూపరాణి తెలిపారు. 5,961 మందికి రూ.2,51 కోట్లను సిబ్బంది ద్వారా అందజేసినట్లు చెప్పారు.

ఇంకొల్లు, న్యూస్‌టుడే: ఇంకొల్లు మండలంలో 96శాతం మందికి పింఛన్ల పంపిణీ జరిగిందని ఎంపీడీవో రాజ్యలక్ష్మి తెలిపారు. 7679మంది లబ్ధిదారులు ఉండగా 7321 మందికి అందజేశారు. మిగిలిన 258 బుధవారం అందజేయనున్నట్లు చెప్పారు.

చందాల పేరుతో మోసంపై ఫిర్యాదు

వేటపాలెం, న్యూస్‌టుడే: రాష్ట్ర దేవాంగ కమిటీ తరపున శ్రీకాళహస్తి, తిరుపతి ప్రాంతాల్లో సత్రాలు నిర్మిస్తున్నామని పలువురు పందిళ్లపల్లిలోని ఆ వర్గీయుల వద్ద రూ.50 లక్షల వరకు ఇటీవల చందాలు వసూలు చేశారు. ఈ సమయంలో సత్రాల కమిటీలో ఇక్కడ వారికి పదవులు ఇస్తామని ఆశచూపారు. దీనిపై వారితో మాట్లాడగా బెదిరిస్తున్నారని, అసలు తాము చందాలే ఇవ్వలేదని బుకాయిస్తున్నారని బాధితులు వాపోయారు. ఈమేరకు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మీసాల వెంకటేశ్వర్లు తెలిపారు.

మత్తు పదార్థాలు ప్రాణాంతకం

ఇంకొల్లు, న్యూస్‌టుడే: మత్తు పదార్థాలు తాగడం ప్రాణాంతకమని సీఐ రమణయ్య హెచ్చరించారు. ఇంకొల్లు జడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం మత్తు పదార్థాలు, ర్యాగింగ్ ఇతర అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ మత్తు పదార్థాలు వ్యక్తులపై చెడు ప్రభావం కలుగజేస్తాయన్నారు. ఎంఈవో శ్రీనివాసరావు పాల్గొన్నారు.

108 వాహనంలో ప్రసవం... తల్లీబిడ్డ క్షేమం

చినగంజాం: 108 వాహనంలోనే ఓ గర్భిణి తన బిడ్డకు జన్మనిచ్చింది. 108 వాహన టెక్నీషియన్ (ఈఎంటీ) కట్టా నాగలక్ష్మి అందించిన వివరాల ప్రకారం.. . పెదగంజాం పరిధిలోని కోడూరివారిపాలెం గ్రామానికి చెందిన రమేష్ భార్య ఈశ్వరమ్మ గర్భిణి. మంగళవారం ఉదయం నొప్పులు రావడంతో 108 వాహనంలో ఎక్కించుకొని వైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యలో ఈశ్వరమ్మ మగబిడ్డకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారు. వారిని చినగంజాం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు 108 సిబ్బంది నాగలక్ష్మి, భాగ్యరావు తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

చీరాల అర్బన్: 9849165189 అద్దంకి: 9440915704 పర్చూరు: 8008574106

? 16వ వార్డు పాపరాజుతోటలోని గణేష్ అపార్ట్‌మెంట్ సమీపంలో వరుసగా మూడు విద్యుత్తు దీపాలు వారం రోజుల నుంచి వెలగడంలేదు. దీనివల్ల రాత్రులు ఇబ్బందిగా ఉంది. **- భాస్కరరావు, స్థానికుడు**

✔ వెంటనే సిబ్బందిని పంపి సమస్యను పరిష్కరిస్తాం. **- కె.చక్రవర్తి, కమిషనరు, చీరాల**

– న్యూస్‌టుడే, చీరాల అర్బన్

మాజీ ఎంపీ నందిగం సురేష్ అనుచరులపై రౌడీషీట్

యద్దనపూడి, న్యూస్‌టుడే: మాజీ ఎంపీ నందిగం సురేష్ ముఖ్య అనుచరుడు, వైకాపా నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పాలపోగు రాంబాబుపై రౌడీషీట్ తెరిచినట్లు ఎస్సై రత్నకుమారి తెలిపారు. బాపట్ల డీఎస్పీ జి.రామాంజనేయులు ఆదేశానుసారం మండలంలోని ఎనిమిది మందిపై రౌడీషీట్ తెరిచామని వెల్లడించారు. కొద్ది నెలల క్రితం వీరంతా మార్టూరు సమీపంలోని ఓ దాబాలో అల్పాహారం చేస్తున్న పలువురు వ్యక్తులపై దాడి చేసిన విషయం తెలిసిందేనన్నారు. అందులో భాగంగా యద్దనపూడికి చెందిన రాంబాబుతో పాటు మున్నంగి వీరయ్య, రాజుపాలెం దేవసహాయం, దావులూరి ప్రతాప్, పల్లెపోగు దేవదాస్, మున్నంగి అరుణబాబు, పల్లెపోగు రవి, జంపని రాజేష్‌లపై రౌడీషీట్ తెరిచామని ఎస్సై చెప్పారు. గ్రామాల్లో ఎలాంటి అలజడులు సృష్టించినా, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

యాజమాన్య విధానాలతో అధిక దిగుబడులు



మార్టూరు: ద్రోణాదులలో వరి రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

అద్దంకి, జే పంగులూరు, బల్లికురవ (అద్దంకి), న్యూస్‌టుడే: సమతుల ఎరువుల యాజమాన్య పద్ధతులు పాటించినప్పుడే అధిక దిగుబడులు సాధించే అవకాశం ఉందని ఏరువాక శాస్త్రవేత్త జె.రాధాకృష్ణ అన్నారు. 'పొలం పిలుస్తోంది'లో భాగంగా మండలంలోని చిన్నకొత్తపల్లి రైతు సేవా కేంద్రం వద్ద జరిగిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అద్దంకి సహాయ వ్యవసాయ సంచాలకులు జె.ధన్‌రాజ్ అధ్యక్షత వహించారు. శాస్త్రవేత్త మాట్లాడుతూ యూరియా అధికంగా వాడటం వల్ల చీడపీడలు పెరుగుతాయన్నారు. మండల ఉద్యాన శాఖాధికారి దీప్తి, వ్యవసాయాధికారి వెంకటకృష్ణ, విస్తరణాధికారి కోటేశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.

✦ బల్లికురవ మండలం కొణిదెన, రాజుపాలెం గ్రామాల్లో ఏవో ఎస్‌పీపీ.కుమారి ఆధ్వర్యంలో పత్తి పంట పొలాలను పరిశీలించారు.

✦ జే పంగులూరు మండలం కొండమంజులూరులో వరి పంటను ఏవో డి.సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో వ్యవసాయ సహాయాధికారులు పరిశీలించారు.

మార్టూరు, పర్చూరు, కారంచేడు, యద్దనపూడి: రైతులు తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించేలా సాగులో మెలకువలు పాటించాలని పర్చూరు, మార్టూరు ఏడీఏలు ఎన్.మోహన్‌రావు, శ్రీనివాసరావు కోరారు. పర్చూరు, మార్టూరు, కారంచేడు, యద్దనపూడి మండలాల్లోని చిమ్మిరిబండ, ద్రోణాదుల, జాగర్లమూడి, ఆదిపూడి, యర్రంవారిపాలెం గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది' నిర్వహించారు. ఏవోలు వీరగంధం కిరణ్‌కుమార్, సుధీర్‌బాబు, ఆదినారాయణ పాల్గొన్నారు.

మేదరమెట్ల, న్యూస్‌టుడే: విత్తనశుద్ధితో రైతులకు ఎంతో ప్రయోజనం ఉంటుందని బాపట్ల డాట్ శాస్త్రవేత్త రాధాకృష్ణ అన్నారు. కొరిశపాడు మండలం ఎర్రబాలెం, తిమ్మనపాలెం గ్రామాల్లో మంగళవారం 'పొలం పిలుస్తుంది' నిర్వహించారు. ఏడీఏ కె.ధనరాజ్, ఏవో పి.శ్రీనివాసరావు, వీఏఏ షరీఫ్, ఏహెచ్ఏ సాహితి, రైతులు పాల్గొన్నారు.

చింతగుంపల, కడవకుదురు (చినగంజాం), న్యూస్‌టుడే: కడవకుదురు, చింతగుంపల గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది' అవగాహన సభలను మండల వ్యవసాయాధికారి కె.భాస్కరరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. చీరాల వ్యవసాయ సహాయ సంచాలకులు టి.రత్నకుమారి, శాస్త్రవేత్త డాక్టర్ ఎం.ఉష, ఉద్యానాధికారి పి.అలేఖ్య, పశువైద్యశాల డాక్టర్ బి.కిశోర్, మార్కెటింగ్ శాఖ అధికారి ఎన్.ఖాజావలి, వీఏఏలు సంధ్య, కిశోర్, దీవెన, సర్పంచులు వై.సత్యనారాయణ, జి.శివకుమారి రైతులు పాల్గొన్నారు.

దుద్దుకూరు (ఇంకొల్లు), పర్చూరు, న్యూస్‌టుడే: పొగాకు, శనగ సాగుచేసే రైతులు దుక్కిలో వేపపిండి, ట్రైకోడెర్మావిరిడి వేసుకోవాలని వ్యవసాయాధికారి వేణుగోపాల్ తెలిపారు. మంగళవారం దుద్దుకూరులో పొలం పిలుస్తోందిలో ఆయన పాల్గొన్నారు. పశు సంవర్థక శాఖ సహాయకుడు అనిల్, మార్కెట్ యార్డు సహాయకుడు సుబ్బారావు, గ్రామ సహాయకులు భరత్, కిశోర్, రైతులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి చెకుముకి పోటీలకు ఎంపిక



ఇంకొల్లు: ప్రథమ స్థానం పొందిన విద్యార్థులతో నిర్వాహకులు

ఇంకొల్లు, మేదరమెట్ల, న్యూస్‌టుడే: జనవిజ్ఞాన వేదిక, యూటీఎఫ్ సంయుక్తంగా మంగళవారం స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మండలస్థాయి చెకుముకి ప్రతిభ పరీక్షల్లో పావులూరు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. టి.విష్ణువర్ధనరెడ్డి, నాగభవ్యశ్రీ, పి.లక్ష్మీప్రణితి ప్రథమ స్థానంలో నిలిచారు. గంగవరం వలేటి కృష్ణయ్య ఉన్నత పాఠశాల విద్యార్థులు నాగపద్మజ, శక్తిచరణ్‌తేజ, రాణా ప్రతాప్ రెడ్డి ద్వితీయ స్థానం సాధించారు. మొదటి స్థానం సాధించిన పావులూరు బృందం అక్టోబరు 27న జరిగే జిల్లా స్థాయిపోటీల్లో పాల్గొంటుందని యూటీఎఫ్ కార్యదర్శి మస్తాన్‌వలి తెలిపారు.

✦ కొరిశపాడు మండలం మేదరమెట్లలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు సైన్స్ విభాగంలో పోటీలు నిర్వహించారు. దీనిలో మేదరమెట్ల జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఎస్‌కే.ఇలియాజ్, బి.జశ్వంత్‌సాయి, ఎస్‌కే.హుస్సేన్‌లతో కూడిన జట్టు, గీతమ్ హైస్కూల్ విద్యార్థులు బి.సింధుప్రియ, ఇ.మనోప్రసన్న, సీహెచ్.దేవదీప్య అంజలిలు ఎంపికయ్యారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బి.అంజయ్య, జేవీవీ మండల అధ్యక్షులు సత్యనారాయణ, బి.కోటేశ్వరి, యూటీఎఫ్ అధ్యక్షుడు కె.పోతురాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

కడవకుదురు (చినగంజాం), న్యూస్‌టుడే: జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుర్రా రామారావు ఆధ్వర్యంలో మండల స్థాయి చెకుముకి ప్రతిభ పరీక్ష కడవకుదురు జడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించారు. పోటీల్లో కడవకుదురు జడ్పీ ఉన్నత పాఠశాల ప్రథమంగా నిలిచినట్లు మండల జన విజ్ఞాన వేదిక కన్వీనర్ ఎస్.నరసింహారావు తెలిపారు.

అద్దంకి, న్యూస్‌టుడే: మండల స్థాయిలో చెకుముకి పోటీ పరీక్షలు కాకానిపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం జరిగాయి. మండలంలోని 13 ఉన్నత పాఠశాలల నుంచి 48మంది విద్యార్థులు హాజరయ్యారు. బాపట్ల జన విజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షులు మన్నం త్రిమూర్తులు, ప్రధాన కార్యదర్శి బి.చంద్రశేఖర్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.